



టౌన్ కొత్తరోడ్డు ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్రలో పాల్గొన్న అశేష భక్తజనం (ఇన్‌సెట్‌లో) బలభద్ర, సుభద్ర, జగన్నాథ స్వామి

కదిలిన జగన్నాథ రథచక్రాలు

అంగరంగ వైభవంగా రథయాత్ర

- వేలాదిగా పాల్గొన్న భక్త జనం
- నేటి నుంచి వివిధ అవతారాల్లో దర్శనమివ్వనున్న స్వామి

జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి రథయాత్రను జిల్లాలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. టౌన్ కొత్తరోడ్డులోని ప్రసిద్ధ ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర పాతనగరం పురవీధుల గుండా సాగి టర్నర్ చౌల్ట్రీ వద్దకు చేరింది. రథయాత్రలో నగరంలోని అనేక ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. టర్నర్‌చౌల్ట్రీలో స్వామి తొమ్మిదిరోజుల పాటు భక్తులకు రోజుకో అవతారంలో దర్శనమిస్తారు. కాగా సాగర్ నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర కన్నుల పండువగా సాగింది.

చెట్లపై అధ్యయనం

- నగరంలో సుమారు 50 చెట్ల వయసు 200 నుంచి 300 సంవత్సరాలు
- ఏయూలో రెండు, రైల్వేస్టేషన్ రోడ్డులో ఒకటి, సింహాచలం కొండపై మరొకటి
- 50 ఏళ్లు దాటిన చెట్లు 20 వేలకుపైగా
- ఎక్కువ వయసున్న చెట్లపై డాక్యుమెంటేషన్
- రంగంలోకి ఏయూ విశ్రాంత ఆచార్యులు

భావితరాలకు వృక్షాల విలువ తెలియజేయడమే ధ్యేయం



సిరిపురం జంక్షన్ వద్ద ఏయూ ప్రాంగణంలో మర్రి చెట్ల వద్ద ఇంటాక్ బృందం (ఫైల్)

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):

కాంక్రీట్ జంగిల్‌గా మారిన మహానగరంలో చెట్ల ఆవశ్యకత, పరిరక్షణపై ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్య పరుస్తూనే ఉన్నాయి. మహా నగరంగా మారే క్రమంలో విశాఖతో మమేకమైన చెట్లు ఇప్పటికే అనేకం ఉన్నాయి. వాటిలో ప్రముఖమైనవి మహావృక్షాలు. నగరంలో పలుచోట్ల విశాలమైన ప్రాంతాన్ని ఆక్రమించుకుని చల్లని నీడనివ్వడంతోపాటు టన్నులకొద్దీ ఆక్సిజన్ విడుదల చేస్తున్నాయి. మరింత ఎక్కువగా బొగ్గుపులుసు వాయువు పీల్చుకుని పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నాయి. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులతో ప్రతి ఏటా ఎండలు పెరిగిపోతున్న క్రమంలో నగరంలో ఉన్న మహా వృక్షాలను గుర్తించేందుకు ముగ్గురు ఏయూ విశ్రాంత ఆచార్యులు రగంలోకి దిగారు. వీరికి ఇంటాక్ విశాఖ చాప్టర్ ఇతోధికంగా సాయమందిస్తోంది.

నగరం, పరిసరాల్లో 50 ఏళ్ల వయసు దాటిన చెట్లు సుమారు 20 వేల వరకు ఉంటాయని ముగ్గురు ఆచార్యులు అంచనాకు వచ్చారు. వీటిలో 200 నుంచి 300 సంవత్సరాల వయసున్నవి 50 వరకు ఉంటాయని భావిస్తున్నారు. వాటిని గుర్తించిన తరువాత సమగ్ర వివరాలతో డాక్యుమెంట్ రూపొందించడంతోపాటు చెట్ల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు సూచించనున్నారు.

బృందంలోని ఆచార్యులు...

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యుడు కె. కామేశ్వరరావు, వృక్షశాస్త్ర మాజీ విభాగాధిపతి విశ్రాంత ఆచార్యుడు వై.వెంకటేశ్వరావు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ మాజీ డైరెక్టర్ డాక్టరు హరిశ్రీరాములు బృందంగా ఏర్పడి నగరంలో పురాతన చెట్ల వివరాలు సేకరించాలని నిర్ణయించారు. దేశ విదేశాలలో అనేకచోట్ల శతాబ్దాల చరిత్ర గల చెట్లను గుర్తించి వాటి ప్రాముఖ్యతను వెల్లడించడం, రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించనున్నారు. దీనిద్వారా భావితరాలకు నగరంలో చెట్ల చరిత్ర, విశేషాలను అందించాలని విశ్రాంత ఆచార్యులు నిర్ణయించారు. పురాతన కట్టడాలు, స్థలాలను పరిరక్షించడం, వాటి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసే 'ఇంటాక్' విశాఖ చాప్టర్ సాయం వీరికి సహకరిస్తుండడంతో ఈ బృందం చెట్ల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 50 ఏళ్లుదాటిన 800 చెట్లను గుర్తించారు. సింహాచలం కొండపై సుమారు 250 ఏళ్ల వయసున్న మర్రిచెట్టును గుర్తించారు. రైల్వే స్టేషన్‌రోడ్డులో ఫ్లైవోవర్‌కు ఆనుకుని సుమారు 130 సంవత్సరాల వయసున్న చెట్టు ప్రాముఖ్యతను డాక్యుమెంటేషన్ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని ... మిగతా 4వ పేజీలో

పోలీస్ శాఖలో 79950 95799 నంబర్ టెర్రర్

సమస్యలు, పోలీసుల పనితీరుపై సమాచారం ఇవ్వాలని సీపీ పిలుపు

- వీడియోలు, ఫొటోలు, మెసేజ్‌లు పంపిస్తున్న నగరవాసులు
- లారీ డ్రైవర్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ డబ్బులు తీసుకుంటున్న వీడియో పంపిన అజ్ఞాత వ్యక్తి
- తక్షణం స్పందించి, సస్పెండ్ చేసిన సీపీ శంఖబ్రత బాగ్జీ
- పోలీస్ వర్గాల్లో మొదలైన అలజడి

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

నగర పోలీసుల్లో 7995095799 ఫోన్ నంబరు గుబులు రేపుతోంది. సీపీగా శంఖబ్రత బాగ్చి బాధ్యతలు చేపట్టిన రోజే హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రకటించారు. ప్రజలకు పోలీసుల నుంచి ఎలాంటి సహాయం అవసరమైనా, లేదంటే పోలీస్‌శాఖలోని అవినీతి, అక్రమాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఈ నంబర్‌కు మెసేజ్, ఫొటో, వీడియో పంపించాలని, ఏ సమయంలోనైనా ఫోన్‌చేసి తన దృష్టికి తేవచ్చునని సూచించారు. దీని ప్రకారం లారీడ్రైవర్ నుంచి ఓ హెడ్‌కానిస్టేబుల్ డబ్బులు వసూలు చేస్తున్న దృశ్యాన్ని అజ్ఞాతవ్యక్తి వీడియో తీసి హెల్ప్‌లైన్ నంబర్‌కు పంపించారు. దీనిపై తక్షణం స్పందించిన సీపీ బాధ్యుడైన హెడ్‌కానిస్టేబుల్‌ని సస్పెండ్ చేశారు. ఈ ఉదంతం నగరంలో అవినీతికి అలవాటు పడిన పోలీసుల్లో కలకలం రేపుతోంది.

నగర పోలీస్‌కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శంఖబ్రత బాగ్చి తొలిరోజే తన పనితీరు ఎలా ఉంటుందో వివరించారు. పోలీస్‌శాఖలో అవినీతిని సహించనని, బాధ్యతా రాహిత్యం, విధుల్లో నిర్లక్ష్యాన్ని క్షమించనని హెచ్చరించారు. అంతేకాకుండా హెల్ప్‌లైన్ పేరుతో ప్రత్యేకంగా ఒక ఫోన్‌నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్టు ప్రకటించారు. ఆ నంబర్‌కు ప్రజలతో పాటు పోలీస్ సిబ్బంది, వారి కుటుంబసభ్యులు కూడా సమస్యలను తెలియజేయవచ్చునని సూచించారు. పోలీసుల్లో ఎవరైనా అవినీతి, అక్రమాలకుపాల్పడినా సరే ఆనంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. తనవద్దే ఆ నంబర్ ఉంటుందని, ఏ సమయంలోనైనా మెసేజ్ లేదా ఫోన్‌చేసి తనతో సమస్యను పంచుకోవచ్చునని, తక్షణం చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. సీపీ ప్రకటనపై చాలామందికి నమ్మకం ... మిగతా 4వ పేజీలో




హెల్ప్‌లైన్ నెంబర్‌ను చూపిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్జీ (ఫైల్ ఫొటో)

మేహాద్రిగెడ్డకు ఊరట!

గేట్ల మరమ్మతులకు అధికారుల కసరత్తు

- రూ.4 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన జలవనరుల శాఖ
- నగరంలో తాగునీటికి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు
- నిర్వహణకు ఐదేళ్లలో రూపాయి విదల్చని వైసీపీ సర్కారు



పాడైన మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్లు

విశాఖపట్నం/ గోపాలపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):

నగరు శివారులో ఉన్న మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు జలవనరుల శాఖ సిద్ధమవుతోంది. రానున్న వర్షాకాలం దృష్ట్యా గేట్ల మరమ్మతులు చేపట్టేందుకు వీలుగా రూ.నాలుగు కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపింది. రిజర్వాయర్‌కు ఉన్న ఆరు గేట్లలో నాలుగు గేట్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గుర్తించిన జలవనరులశాఖ, నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

గతంలో రిజర్వాయర్ నుంచి కేవలం సాగు అవసరాలకు మాత్రమే నీటిని వినియోగించేవారు. అయితే నగర జనాభా పెరిగిన నేపథ్యంలో తాగునీటి అవసరాలకు మార్చారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌ను 1980కు ముందు నిర్మించారు. పెందుర్తి, సబ్బవరం, కొత్తవలస పరిసర ప్రాంతాల్లో చెరువులు నిండిన తరువాత వచ్చే నీరు, వర్షాకాలంలో పరిసరాల నుంచి వచ్చే నీరు దీనికి ప్రధాన ఆధారం. సుమారు 2,716 ఎకరాల్లో ఒక టీఎంసీ సామర్థ్యంతో ఇక్కడ రిజర్వాయర్‌ను నిర్మించారు. 40 అడుగుల వెడల్పు, 12 అడుగుల ఎత్తులో ఆరు గేట్లను అమర్చారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 61 అడుగులు కాగా డెడ్ స్టోరేజ్ 44 అడుగులు. వర్షాకాలంలో 61 అడుగుల సామర్థానికి వచ్చేసరికి గేట్లు ఎత్తి, నీటిని దిగువకు విడిచిపెడుతుండేవారు. అయితే 45 సంవత్సరాలకు పూర్వమే ఏర్పాటుచేసిన గేట్ల మరమ్మతులపై అధికారులు పట్టించుకోలేదు. రిజర్వాయర్ కింద సాగు లేకపోవడంతో నగర ప్రజల తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వినియోగిస్తున్నారు. నిర్వహణ జలవనరులశాఖ పరిధిలో ఉండగా, నీటిని జీవీఎంసీ పైపుల ద్వారా ప్రజలకు అందిస్తోంది. దీంతో నిర్వహణ కోసం ఏటా కొంత మొత్తం ... మిగతా 4వ పేజీలో

హంతకుడి కోసం ముమ్మర గాలింపు

20కి పైగా ప్రత్యేక బృందాల ఏర్పాటు

- బాలిక హత్య కేసులో పోలీసుల ముమ్మర దర్యాప్తు
- బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్న హోం మంత్రి వంగలపూడి అనిత



అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగొండపాలెంలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను శనివారం దారుణంగా హత్య చేసిన నిందితుడు బోడా బత్తుల సురేశ్ (26) కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి స్పెషల్ బ్రాంచి, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో 20కి పైగా బృందాలతో బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, సినిమా హాళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో గాలిస్తున్నారు.

- వివరాలు మెయిన్ 7లో

బిగుస్తున్న ఉచ్చు

జిల్లా ఖజానా కార్యాలయంలో అవినీతిపై ఫోకస్

- పలువురిపై ఉన్నతాధికారుల గురి
- ఆడిటింగ్ లేకుండానే బిల్లుల అప్‌లోడ్
- సీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేయాలంటే పైసలు పడాల్సిందే
- కార్యాలయాన్ని ప్రక్షాళన చేసే దిశగా అడుగులు



కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయం

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ఖజానా కార్యాలయంలో అవినీతికి పాల్పడిన ఉద్యోగులపై ఉచ్చు బిగుస్తోంది. ప్రధానంగా ఒక అధికారి, కొందరు సిబ్బందిపై ఆరోపణలు రావడంతో ఖజానా రాష్ట్ర డైరెక్టర్ మోహనరావు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలు శాఖల ఉద్యోగుల నుంచి సేకరించిన వివరాల మేరకు బాధ్యులపై చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, పౌర సరఫరాలు, పోలీసులు, రోడ్లు, భవనాలు, పశుసంవర్ధకశాఖతోపాటు మరికొన్ని శాఖల నుంచి ఖజానా కార్యాలయంపై ఫిర్యాదులు వచ్చాయి. మరిన్ని శాఖల నుంచి ఫిర్యాదులు అందకపోయినా భారీగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జీతాలతోపాటు పలు రకాల బిల్లులు పరిశీలించి, సక్రమంగా ఉన్నాయా? లేదా చూసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రతి బిల్లు జూనియర్ అకౌంటెంట్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ముందు సీనియర్ అకౌంటెంట్లు ఆడిటింగ్ చేయాలి. కానీ చాలా బిల్లులకు ఈ పద్ధతి పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ఇదేమని ప్రశ్నిస్తే పని ఒత్తిడి అంటూ తప్పించుకుంటున్నారు. బిల్లులు రూపొందించి అప్‌లోడ్ చేసే సమయంలో పొరపాట్లు ఉంటే వెంటనే వెనక్కి వస్తాయి. వాటిలో తప్పులు సవరించి తిరిగి అప్‌లోడ్ చేయాలంటే ఆయా శాఖల ఉద్యోగులకు చుక్కలు చూపిస్తుంటారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి తిప్పించుకుని, చేయి తడిపితేనే అప్‌లోడ్ చేస్తుంటారని వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అన్ని శాఖల ఉద్యోగుల జీతాలు, బిల్లులు రూపొందించి అప్‌లోడ్ చేసే ముందు 'ఫైలీప్' (టోకెన్ నంబర్లతో కూడిన వివరాలు ఒక రికార్డులో నమోదుచేయాలి) నిర్వహణ కిందిస్థాయి ఉద్యోగులకు అప్పగించి, పైసలు వచ్చిన ఫైళ్లను సీనియర్ అకౌంటెంట్లు చూస్తారన్న ఆరోపణలున్నాయి. కాగా బిల్లులు పరిశీలించి అప్‌లోడ్ చేసేందుకు డబ్బు వసూలు చేస్తారంటున్నారు. ఐదారు నెలల క్రితం ఒక ప్రభుత్వ శాఖలో సీనియర్ అధికారికి పెండింగ్‌లో ఉన్న పలు రకాల ప్రయోజనాల మంజూరు రూ.లక్షల్లో లంచాలు తీసుకున్నారని ఆరోపణలున్నాయి. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారని చెబుతున్నారు. కొందరు ఉద్యోగులు సర్వీస్‌లో చేరి పదేళ్లు కాకముందే పోష్ లొకాలిటీలో ఫ్లాట్లు కొనుగోలుచేశారని చెబుతున్నారు. ఇదిలావుండగా ఖజానా కార్యాలయంపై ఆరోపణలు, పలు శాఖల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు డైరెక్టర్ విచారణ చేపట్టడం కలకలం రేపింది. కార్యాలయంలో అవినీతికి తెరదించాలంటే పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని పలు శాఖల ఉద్యోగులు కోరుతున్నారు.

సెయింట్ లూక్స్ కార్యకలాపాలపై విచారణ

విశాఖపట్నం/ఎండాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎండాడలో సెయింట్ లూక్స్ విద్యా సంస్థకు కేటాయించిన భూమిలో కార్యకలాపాలపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. విశాఖ రూరల్ తహసీల్దారు కార్యాలయం సిబ్బంది రెండు రోజుల క్రితం ఎండాడలో సెయింట్ లూక్స్ సంస్థ ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సెయింట్ లూక్స్ విద్యా సంస్థకు ఎకరా రూ. 5 లక్షల వంతున 7.5 ఎకరాలు కేటాయించారు. విద్యా కార్యకలాపాల కోసం ఇచ్చిన స్థలంలో ఎంత మేరకు అనుకున్న మేర వినియోగిస్తున్నారు ? అన్న దానిపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు భీమిలి ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం కేటాయించిన భూమిలో వినియోగం ఎంత, విద్యా కార్యకలాపాల కోసం ఉన్న భవనాలు ఎన్ని ? వాటి విస్తీర్ణం ఎంత ? ఇతరత్రా అవసరాలకు వినియోగిస్తున్నారా? అన్న కోణంలో విచారించి నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ విశాఖ రూరల్ తహసీల్దారును ఆదేశించడంతో రెండు రోజుల క్రితం ఆర్ఐ ప్రవీణ, సర్వేయర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. నివేదికను భీమిలి ఆర్డీవోకు నివేదించారు. అయితే భూమి కేటాయింపు సమయంలో పేర్కొన్న నిబంధనల మేరకు భూ వినియోగం ఉందా ? లేదా అన్న దానిపై చేపట్టిన విచారణ వివరాలు బయటకు రాలేదు. కాగా సెయింట్ లూక్స్ సంస్థకు భూ కేటాయింపులపై తొలి నుంచీ విమర్శలు ఉన్నాయి. రాజశేఖరరెడ్డి హయాంలో క్రిస్టియన్ మైనారిటీ విద్యా సంస్థకు కారుచౌకగా భూమి కేటాయింపులు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సెయింట్ లూక్స్ విద్యా సంస్థపై విచారణ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఘనంగా ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం

మద్రిపాలెం, జూలై 7: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) 30వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం 53వ వార్డులో ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంఆర్పీఎస్ జెండాను పోరాట సమితి నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ30 ఏళ్లుగా మాదిగ రిజర్వేషన్ కోసం మంద కృష్ణ మాదిగ చేస్తున్న కృషి అందరికీ ఆదర్శనీయమన్నారు. ప్రతి ఒక్కరు ఆయనకు మద్దతుగా నిలుస్తూ తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. అనరంతం మంద కృష్ణమాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అలాగే, వరంగల్‌లో త్వరలో జరిగే కవాతుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఎస్పీ ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ యల్ల బిల్లి గోవిందరాజు, గంట్యాడ చిన్నఅప్పలరాజు, ముప్పిడి దేవేశ్వరరావు, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





పూజలు చేస్తున్న పీఠాధిపతి త్రిదండి స్వామి కేశవ గోస్వామి మహరాజ్..., రథాన్ని లాగుతున్న భక్తులు, వన్‌టౌన్‌లో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు

ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర

మహారాణిపేట, జూలై7: జడ్పీ జంక్షన్‌లో ఉన్న శ్రీ కృష్ణమందిరం చెందిన కృష్ణ చైతన్యమఠం వద్ద పీఠాధిపతి త్రిదండి స్వామి కేశవ గోస్వామి మహరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథ స్వామి రథయాత్రను నిర్వహించారు. బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామిలతో సాగర తీరంలోని ఆర్‌బీచ్ వద్దనుంచి ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. కృష్ణభక్తులు, వైష్ణవులు, సన్యాసులు, భక్త బృందాల హరినామ సంకీర్తనలు, కోలాటాలు, గంటానాదాలతో కోస్టల్‌బ్యాటరీ, కలెక్టరేట్ జంక్షన్ మీదుగా జడ్పీ వద్ద కృష్ణ మందిరం వరకు రథయాత్ర కొనసాగింది. పెద్దఎత్తున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జగదాంబ: వన్‌టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథ రథయాత్ర ఘనంగా సాగింది. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ



శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

అక్కయ్యపాలెం, జూలై 7 : రాజస్థాన్ ఉదయపూర్‌కు చెందిన నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలో ఆదివారం దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ నారాయణ సేవా సంస్థ ప్రపంచ వ్యాప్తంగా వివిధ చోట్ల దివ్యాంగులకు ఉచిత సేవలందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపడం గొప్పవిషమని అన్నారు. నగరంలో సుమారు 350 మందికి శిబిరం ద్వారా ఉచిత కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. సంస్థాన్ అధ్యక్షుడు అగర్వాల్ మాట్లాడుతూ రాజస్థాన్‌లో తమకు 1100 పడకల ఆస్పత్రి నిర్వహిస్తున్నామని, జర్మనీ టెక్నాలజీతో రూపొందిస్తున్న కృత్రిమ చేతులు, కాళ్లు తయారీకి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి రోజూ 80 నుంచి 100 ఆపరేషన్లు చేయడంతో పాటు అనేకమంది దివ్యాంగులకు ఉచితంగా వసతి, భోజనం, ఆర్థిక వనరులు సమకూరుస్తూ గత 39 ఏళ్ళుగా సేవలందిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, విశ్వనాథ్ కన్వెన్షన్ అధినేత కాశీ విశ్వనాథ్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రోటరీ సేవలు ఆదర్శం: ఎంపీ శ్రీభరత్



కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, తదితరులు

డాబాగార్డెన్స్, జూలై 7: ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్పవిషయమని విశాఖ ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం డాబా గార్డెన్స్‌లోని ఓ హాల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ మూడవ విశాఖ స్థాపన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. జాన్సన్ కంట్రోల్స్ హిటాచి ఎయిర్ కండిషనింగ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.వాసుదేవన్ పాల్గొన్నారు. 2024-25 అధ్యక్షునిగా మహమ్మద్‌యాసీన్, కార్యదర్శిగా చింతా నేతాజీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగరాజు, బి.శంకరరావు, సభ్యులు పాల్గొన్నారు.

వాల్తేరు డివిజన్ నూతన సీనియర్ డీసీఎం-2గా పవన్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న పవన్‌కుమార్

విశాఖపట్నం, జూలై 7: తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ కొత్త సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్-2గా కే పవన్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సివిల్ సర్వీసెస్ 2016 ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసెస్ (ఐఆర్‌టీఎస్) బ్యాచ్‌కు చెందిన పవన్‌కుమార్.. సౌత్ వెస్ట్రన్ రైల్వే ఫ్రైట్ ఆపరేషన్స్ ఏరియా ఆఫీసర్ హోస్పేట్‌గా, హుబ్లి డివిజన్ గూడ్స్ ఆపరేషన్స్ డీవోఎంగా పనిచేశారు. సౌత్ వెస్ట్రన్ రైల్వేలో సరకు రవాణా కార్యకలాపాలలోచురుకైన బాధ్యతలు నిర్వర్తించి 2021-22 లో పీసీవోఎం, జీఎం అవార్డులందుకున్నారు. కాగా వాల్తేరు డివిజన్‌డీసీఎం పనిచేస్తున్న ఏ అవినాష్‌కు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా (జనరల్) పదోన్నతి లభించినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి చదరంగం పోటీలు



విజేతలతో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 7: ఆల్ వైజాగ్ చెస్ సంఘం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-11 చెస్ పోటీలు కమ్ జిల్లా జట్టు ఎంపికలు ఆదివారం ముగిశాయి. బుల్లయ్య కాలేజీ ఆవరణలో జరిగిన ఈ టోర్నీ ఓపెన్ కేటగిరిలో అనిపిండి వంశీ (6.5 పాయింట్లు), వాసిరెడ్డి అర్జున్ (6 పాయింట్లు)...బాలికల విభాగంలో దివ్య దర్శిని మోయిదా (5.5), పితాని సత్య శ్రీ విద్య (5) తొలి రెండు స్థానాలలో నిలిచారు. విజేతలకు ఆల్ వైజాగ్ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ చిన్నారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మణికంఠరావు, ఉమామహేశ్వరరావు, కామేష్, ఎంపీఎస్.ప్రసాద్‌పాల్గొన్నారు.

భూ వివాదంపై సీపీకి ఎన్ఆర్ఐ దంపతుల ఫిర్యాదు

విశాఖపట్నం/భీమునిపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమ భూమిని మంచి ధరకు అమ్మి పెడతానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై చర్యలు కోవాలని కోరుతూ న్యూజిలాండ్‌లో ఉంటున్న దంపతులు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై భీమిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన కందికట్ల విద్యా సంజీవ్, పేరం సంజీవ్ విజయకుమారి దంపతులు 18 ఏళ్లుగా న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో నివాసం ఉంటున్నారు. వారు భీమిలి మండలం కాపులుప్పాడ-గొల్లల తిమ్మాపురం వద్ద సర్వే నంబరు 328/19లో 968 గజాల స్థలాన్ని 2006లో కొనుగోలు చేశారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే నంబర్ తప్పుగా పడినప్పటికీ ఎన్ఆర్ఐ దంపతులు గుర్తించలేదు. తర్వాత ఆ భూమిని విక్రయించాలని ఎన్ఆర్ఐ దంపతులు ప్రయత్నాల్లో భాగంగా కొండపల్లి రుమాంబ 2022లో జీపీఏ చేశారు. కాగా రుమాంబ ఆ భూమిని ఎవరూ కొనడం లేదంటూ మభ్యపెడుతూ రావడంతో ఇటీవల ఆ దంపతులు తమ భూమి వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించగా 2024 ఏప్రిల్‌లోనే ఆ భూమిని వేరొకరికి విక్రయించేసినట్టు గుర్తించారు. దీంతో తమను మోసం చేసిన రుమాంబపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు సీపీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీపీ భీమిలి సీఐని ఆదేశించారు.

చోరీలకు పాల్పడిన 69 మంది అరెస్టు

▸▸ రూ. 37 లక్షల చోరీ సొత్తు స్వాధీనం సీపీ శంఖబ్రతబాగ్చి



చోరీ సొత్తును పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పలు చోరీలకు పాల్పడిన 69 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.37.12 లక్షల విలువైన సొత్తుని స్వాధీనం చేసుకున్నారు. ఆయా కేసుల్లో బాధితులకు రికవరీ సొత్తును అందజేసేందుకు పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం 'రికవరీ మేళా' ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ నగరంలో గత నెలలో 99 చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. ఆయా కేసుల్లో రూ.78.60 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైందన్నారు. వీటిలో 66 కేసులను ఛేదించామన్నారు. గతంలో జరిగిన చోరీలకు సంబంధించి మరో 14 కేసులను కూడా ఛేదించామన్నారు. మొత్తంగా 80 కేసులను ఛేదించామని తెలిపారు. వీటిలో దోపిడీ ఒకటి, పగటి దొంగతనాలు మూడు, రాత్రి పూట ఇళ్లలో చోరీలు, ఆటో, కారు చోరీలు, 16 సాధారణ చోరీలు, తొమ్మిది చైన్‌స్నాచింగ్‌లు, 24 మోటారుసైకిళ్లచోరీలు, ఏడు వైర్ల చోరీలు, జేబు దొంగతనం ఒకటి, మిగిలిన ఇతర చోరీలకు సంబంధించిన కేసులు ఉన్నాయని తెలిపారు. ఆయా నేరాలకు పాల్పడిన 69 మందిని అదుపులోకి తీసుకుని రూ. 37. 12 లక్షల విలువ చేసే 381.93 గ్రాముల బంగారం, 501.36 గ్రాములు వెండి, రూ.7.94 లక్షలు నగదు, 24 బైక్‌లు, ఒక ఆటో, కారుతో పాటు ఇతర విలువైన సొత్తు రికవరీ చేశామన్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో 12 మంది మైనర్లు ఉన్నారన్నారు. చోరీ నియంత్రణలో భాగంగా నగరంలో రాత్రి పెట్రోలింగ్‌ను బలోపేతం చేశా మని, గత నెలలో 338 సీసీ కెమెరాలు కొత్తగా ఏర్పాటు చేశామని, చోరీల నియంత్రణకు 120 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. నేరాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్రైమ్ బీట్‌లు వేస్తున్నామన్నారు. 2022లో 820 చోరీలు నమోదు కాగా రూ.5.79 కోట్ల సొత్తు అపహరణకు గురైందన్నారు. వీటిలో 660 కేసులు ఛేదించి రూ. మూడు కోట్ల విలువైన సొత్తుని రికవరీ చేశామన్నారు. గత ఏడాది 678 చోరీకేసుల్లో రూ.5.29 కోట్లు సొత్తు అపహరణకు గురైతే, వాటిలో 482 కేసులు ఛేదించి రూ.3.36 కోట్లు విలువైన సొత్తు రికవరీ చేశామన్నారు. 2024లో ఇప్పటివరకూ 504 చోరీలు జరిగితే వీటిలో 333 కేసులను ఛేదించామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప, క్రైమ్ డీసీపీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

69వ వార్డు కార్పొరేటర్ గోవిందరెడ్డిపై కేసు నమోదు

▸▸ దౌర్జన్యంపై భార్యాభర్తల ఫిర్యాదు

గాజువాక, జూలై 7: భార్యాభర్తలపై దౌర్జన్యానికి పాల్పడిన ఆరోపణలపై గ్రేటర్ 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డిపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. రెడ్డి తుంగ్లాం ప్రాంతానికి చెందిన కొల్లి సత్యవతి చీటీల నిర్వహణలో భాగంగా అప్పులపాలయ్యారు. దీంతో చీటీలు పాడుకున్న వారికి సకాలంలో నగదు చెల్లించకపోవటం, వారి నుంచి ఒత్తిడి వస్తుండంతో సత్యవతి, ఆమె భర్త సురేష్‌తో కలిపి కార్పొరేటర్ గోవిందరెడ్డి ఇంటికి ఇటీవల వెళ్లి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. ఈ క్రమంలో అప్పులకు సంబంధించి వివరాలను వెల్లడించి, వీటిని తీర్చలేని పరిస్థితుల్లో ఉన్నామని చెప్పారు. సత్యవతికి చెందిన సుమారు రూ. 2 కోట్ల విలువైన ఇంటిని తనకు విక్రయిస్తే అప్పులు ఇవ్వాల్సిన వారందరికీ నగదు చెల్లిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. దీంతో ఈ ఏడాది మే 19న సదరు ఇంటిని కార్పొరేటర్ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. అయితే, రెండు నెలలు గడుస్తున్నా, ఏ ఒక్కరికి అప్పు చెల్లించకపోవటంతో చీటీదారులు సత్యవతి ఇంటికి వెళ్లి గొడవకు దిగుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం చీటీ నిర్వాహకురాలు సత్యవతి, భర్త సురేష్‌లు కార్పొరేటర్ గోవిందరెడ్డి ఇంటికి వెళ్లి అప్పులు తీర్చకపోవడం నిలదీశారు. అప్పుల వారు తమ ఇంటికి వచ్చి గొడవకు దిగుతున్నారని తెలిపారు. దీంతో గోవిందరెడ్డి ఆగ్రహించి సత్యవతిపై దుర్భాషలాడి, చేయిచేసుకున్నారు. ఆమె భర్త సురేష్‌ను ఇంటినుంచి బయటకు తోసేశాడు. దీంతో భార్యాభర్తలిద్దరు నేరుగా గోవిందరెడ్డి దౌర్జన్యంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారు

అక్కయ్యపాలెం, జూలై 7 : గ్రేటర్ 26వ వార్డు లలితానగర్‌లోని లలితాపీఠంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించి పూజించడం వల్ల భూ సంబంధిత వ్యవహారాల పరిష్కారం, శత్రునాశనం, ఆరోగ్యం, మానసిక సమస్యల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న రోటరీ సభ్యులు

డాబాగార్డెన్స్, జూలై 7: అత్యవసర సమయంలో రక్త నిల్వలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని ఆర్‌టీఎస్ ఏకేఎస్ బాస్కరవర్మ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ ఎలీట్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర మిశ్రా నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి కార్యదర్శి రమణరావు, జైన్ హాజరై జ్యోతి ప్రజ్వలనగావించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్ రాఘవేంద్రమిశ్ర, సెక్రటరీ బీవీ రమణరావులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రాథోర్, సభ్యులు పాల్గొన్నారు.

చెట్లపై అధ్యయనం

... 3వ పేజీ తరువాయి

విజయనగర ప్యాలెస్ (పెదవాల్తేర్ రోడ్డుకు ఆనుకుని)లోని ప్రవేశాల డైరెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మర్రిచెట్టు వయసు 200 ఏళ్లు దాటి ఉంటుందని గుర్తించారు. సిరిపురం జంక్షన్‌కు ఆనుకుని ఏయూలో మరో మర్రిచెట్టు, దొండపర్తి ఎరుకుమాంబ దేవాలయం ముందు రావి చెట్టు, అదే ప్రాంతంలోని పరదేశమ్మ గుడి సమీపంలో ఓ చెట్టు, అక్కయ్యపాలెం రోడ్డు జగ్గారావు బ్రిడ్జి, రైల్వేకాలనీల్లో పలుచోట్ల మర్రి, రావి, కాగు చెట్లు, టౌన్‌హాలు వద్ద రెండు మహావృక్షాలు, కంచరపాలెం, మర్రిపాలెం తదతర ప్రాంతాల్లో 50ఏళ్లు వయసు దాటిన చెట్లను గుర్తించారు. నగరంలో చెట్ల వివరాలపై పూర్తిస్థాయిలో డాక్యుమెంటేషన్ రూపొందించేందుకు మరికొంత సమయం పడుతుందని ఆచార్య కామేశ్వరరావు తెలిపారు.

పర్యావరణానికి మేలు...

ఏయూ ప్రవేశాల డైరెక్టరేట్ వద్ద ఉన్న చెట్ల కారణంగా భూగర్భజలాల పరిరక్షణ సాధ్యమవుతుందని ఆచార్యులు చెబుతున్నారు. ఒక్కో చెట్టు తన జీవితకాలంలో సుమారు 500 టన్నుల బొగ్గుపులుసు వాయువును పీల్చుకుంటాయని, ఏళ్లతరబడి ఉన్న మహా వృక్షాలవల్ల భూగర్భజలాల పరిరక్షణ, భూమి కోత నివారణ, ఆక్సిజన్ విడుదల, బొగ్గుపులుసు వాయువు పీల్చుకోవడంతో పాటు వేలాది మందికి చల్లనినీడను అందిస్తాయన్నారు.ఇంకా వేల రకాలైన పక్షులు, క్రిమికీటకాలు చెట్లపై జీవిస్తాయని, పర్యావరణంతోపాటు జీవవైవిధ్యం కాపాడేందుకు చెట్లు సాయపడతాయన్నారు. నగరం, పరిసరాల్లో 50 ఏళ్ల వయసు దాటిన చెట్ల వివరాలపై సమగ్రంగా డాక్యుమెంటేషన్ రూపొందించి ప్రజలకు అందించాలన్నదే తమ ధ్యేయమని, తద్వారా వాటి పరిరక్షణకు వీలు కల్పించినట్లు అవుతుందని పేర్కొన్నారు.

పోలీస్ శాఖలో 7995095799 నంబర్ టెర్రర్

... 3వ పేజీ తరువాయి

ఉన్నప్పటికీ, కొద్దిమందిలో సీపీగా బాధ్యతలు చేపట్టిన సమయంలో హడావుడి చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైంది. అలాంటి వాటిని పటాపంచలు చేస్తూ హెల్ప్‌లైన్ నంబర్‌కు వచ్చిన సమాచారం ఆధారంగా ఆదివారం చర్యలు చేపట్టడం పోలీస్‌శాఖతో పాటు నగరవాసుల్లో చర్చనీయాంశంగా మారింది.

వీడియా ఆధారంగా చర్యలు

పోర్టు నుంచి వచ్చే లారీలు ఇతర భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించడం నిషిద్ధం. పోర్టు నుంచి నేరుగా షీలానగర్ జంక్షన్‌కు వెళ్లి, అక్కడి నుంచి అటు గాజువాక, ఇటు ఎన్ఏడీ జంక్షన్ వైపు వెళ్లాలి. దీనివల్ల రోడ్డు ప్రమాదాల నివారణకు వీలుంటుంది. కానీ నగరంలో రాత్రి పది గంటల తర్వాత ట్రాఫిక్ తక్కువగా ఉండే నేపథ్యంలో పోర్టు నుంచి వాహనాలు డాబాగార్డెన్స్ మీదుగా మద్దిలపాలెం, అటు రైల్వేస్టేషన్ మీదుగా తాటిచెట్లపాలెం జంక్షన్‌కు వెళుతుంటాయి. వాటిని ఆపి, కేసులు నమోదుచేయాల్సిన పోలీసులు లారీడ్రైవర్ల నుంచి డబ్బులు తీసుకుని వదిలేస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోర్టు నుంచి కాన్వెంట్ జంక్షన్‌మీదుగా డాబాగార్డెన్స్‌వైపు వెళ్తున్న లారీని నైట్‌డ్యూటీలో ఉన్న హార్బర్ పోలీస్‌స్టేషన్ క్రైమ్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వర్మ ఆపారు. లారీని స్టేషన్‌కు తరలించాలని బెదిరించారు. డ్రైవర్ బతిమలాడుకోవడంతో డబ్బులు ఇస్తే వదిలిపెడతానన్నారు. దీనికి డ్రైవర్ అంగీకరించడంతో తనతోపాటు నైట్‌డ్యూటీలో ఉన్న హోంగార్డు పి.శేషుని పంపించి డ్రైవర్ నుంచి డబ్బులు వసూలుచేశారు. ఈ దృశ్యాన్ని కొంతదూరం నుంచి ఎవరో వీడియో తీశారు. దానిని సీపీ హెల్ప్‌లైన్ నంబర్‌కు పంపించారు. తెల్లవారే సరికి సదరు హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీచేయడంతో ఒక్కసారిగా పోలీస్‌వర్గాలు ఉలిక్కిపడ్డాయి. సీపీ మాటల మనిషి కాదని, చేతల మనిషేనని అభిప్రాయపడుతున్నారు. ఈ చర్యలతో ఏక్షణంలో ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనని పోలీస్‌శాఖలోని అవినీతిపరులు బిక్కుబిక్కుమంటున్నారు.

అవినీతిపరుల్లో వణుకు

ఈ దశలో నగరంలో పనిచేస్తున్న ఎస్ఐలు, సీఐల్లో కొందరు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోవడమే మేలనే భావనలో ఉన్నారు. నగరంలో పనిచేసేందుకు ఉబలాటపడుతున్న ఇతర జిల్లాల్లోని పోలీస్ అధికారులు సైతం నగరానికి రావడానికి ఇప్పుడు వెనుకడుగు వేస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఏదిఏమైనా క్రైమ్ హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయడం ద్వారా సీపీ భవిష్యత్తులో తనచర్యలు ఎలా ఉండబోతున్నాయనే సంకేతాన్ని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఇచ్చారని నగరవాసులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా భవిష్యత్తులో కూడా సీపీ ఇదే పనితీరును కొనసాగించాలని కోరుతున్నారు.

మేహాద్రిగెడ్డకు ఊరట!

... 3వ పేజీ తరువాయి

జలవనరులశాఖకు జీవీఎంసీ చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం ఈ బకాయి కోట్లలో ఉంది. ఈ నేపథ్యంలో రిజర్వాయరు గేట్ల నిర్వహణపై రెండు శాఖలు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో మొత్తం ఆరింటిలో నాలుగు గేట్లు పూర్తిగా పాడవగా, రెండుగేట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రతి సీజన్‌లో గేట్లకు గ్రీజు రాయడం, పనిచేస్తున్నాయా? లేదా అనేది తనిఖీ చేయాల్సి ఉంది. ఇటీవల నాలుగు గేట్లకు రంగులు వేయడం మినహా ఇతరత్రా మరమ్మతులు చేయలేదు. పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడంతో ఏటా వర్షాకాలంలో రిజర్వాయర్ నీటి సామర్థ్యం 60 అడుగులకు వచ్చేసరికి రెండు గేట్లు ఎత్తి నీటిని కిందకు విడిచిపెడుతున్నారు. మరమ్మతుల కోసం చాలాకాలంగా ప్రతిపాదనలు రూపొందించినా అమలుకాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలవనరుల ప్రాజెక్టులకు ప్రాధాన్యత పెరిగిన నేపథ్యంలో అధికారులకు అప్రమత్తమై మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్లు మరమ్మతులకు రూ.4 కోట్లతో ప్రతిపాదించారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన తరువాత ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని జలవనరులశాఖ సీఈ ఎస్.సుగుణాకరరావు తెలిపారు. రిజర్వాయర్‌కు గేట్లు చాలా ప్రధానమైనవని పేర్కొంటూ అత్యవసరంగా నిధులు విడుదలచేయాలని కోరామన్నారు.

ఉత్తరాంధ్ర లయన్స్‌పై రాయలసీమ కింగ్స్ గెలుపు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 7: ఏపీఎల్ సీజన్-3 టోర్నీలో భాగంగా ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఆరు వికెట్ల తేడాతో ఉత్తరాంధ్ర లయన్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఉత్తరాంధ్ర లయన్స్ నిర్ణీత 20 ఓవర్లలో పది వికెట్లకు 121 పరుగులు చేసింది. బ్యాటింగ్ ప్రారంభించిన ఏడు బంతుల్లోనే ఓపెనర్లు గుల్ఫామ్ (4), తరుణ్ (1) అవుట్‌కాగా, వారి స్థానాలలో దిగిన తపస్వి (20), శ్రీరామ్ వెంకట రాహుల్ (20) కొద్దిసేపు ఆదుకునే ప్రయత్నం చేశారు. తర్వాత వచ్చిన బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేక పెవిలియన్ దారి పట్టారు. రాయలసీమ బౌలర్లలో గిరినాథరెడ్డి, షేక్ మహ్మద్ రఫీ, బి.వినయ్ తలో రెండు వికెట్లు పడగొట్టగా సత్యనారాయణరాజు, ఆంజనేయులు చెరో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ 17.3 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 122 పరుగులతో లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా డీబీ ప్రశాంత్ కుమార్, గేమ్ ఛేంజర్‌గా గిరినాథరెడ్డి అవార్డులందుకున్నారు.

గోదావరి టైటాన్స్‌పై వైజాగ్ వారియర్స్ గెలుపు

ఏపీఎల్ క్రికెట్ సాయంత్రం జరిగిన మరో మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ ఎనిమిది వికెట్ల తేడాతో గోదావరి టైటాన్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 164 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన వైజాగ్ వారియర్స్ 15.5 ఓవరలో కేవలం రెండు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది.

సరికొత్త ఫీచర్లతో ఈపీడీసీఎల్ మొబైల్ యాప్

▸▸ ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వినియోగదారుడి 16 అంకెల సర్వీసు నెంబరు నమోదు చేసుకోవడం ద్వారా యాప్ సేవలను పొందవచ్చన్నారు. యాప్‌లో బిల్ పే ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎటువంటి అదనపు రుసుం లేకుండా అత్యంత సులభతరంగా చెల్లించవచ్చని వివరించారు. వినియోగ దారుడి సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, చెల్లింపు, సరఫరా పరిస్థితి తదితర వివరాలను కూడా తెలుసుకోవచ్చన్నారు. మై యూసెజ్ ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్ లో ఉన్న రీడింగ్ ప్రకారం కేవలం వినియోగపు యూనిట్లను సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించుకోవచ్చన్నారు. యాప్ ద్వారా ఆధార్ నెంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతో పాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చన్నారు. పేటీఎం, ఫోన్ పే, జీపేతో సహా ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు నేరుగా చెల్లించే విషయంపై ఆర్‌బీఐ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పాత విధానంలోనే ఫోన్ పే, పేటీఎం, జీ పేలు ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు వెల్లడించారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌లో గాని, సంస్థ వెబ్‌సైట్‌లో గాని బిల్లులు చెల్లించే సమయంలో వినియోగ దారులు తమ ఫోన్ పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌తో పాటు నెట్‌బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులు, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని సీఎండీ పేర్కొన్నారు.



పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పురందేశ్వరిని కలిసిన ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 7: ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో పునఃవిలీనం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని, ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిందిగా రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రాజమండ్రిలో ఆదివారం ఆమెను కలిసి పలు అంశాలను వివరించారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయడం వల్ల ఉక్కు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకునేలా చూడాలని ఆమెను కోరారు. ఎంపీని కలిసిన కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

అనకాపల్లి ఎంపీ రమేశ్‌కు వినతి

వేపగుంట, జూలై 7: అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను జీవీఎంసీ 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు అనకాపల్లి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వేపగుంట పరిధిలోని ఉడా భూములు సమస్యను పరిష్కరించాలని, అలాగే, ఎంపీ నిధులతో వార్డు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్య క్రమంలో యువనాయకుడు మామిడి కిరణ్, ఉద్యోగ సంఘనాయకులు పీవీ సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

92వ వార్డులో గణబాబు పర్యటన

గోపాలపట్నం, జూలై 7: గ్రేటర్ 92వ వార్డు దోబీ కాలనీలో పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో భారీ వృక్షం కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ చెట్టును తొలగించాలని జీవీఎంసీ అధికారులను ఆయన ఆదేశించారు. కాలనీలో విద్యుత్, త్రాగునీరు, వీధి దీపాల నిర్వహణ సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కల్వర్టు పనులకు శంకుస్థాపన

పెందుర్తి, జూలై 7; గ్రేటర్ 97 వ వార్డు సమీపంలోని చినముషిడివాడ శారదాపీఠం ఆర్చ్ వద్ద రూ. 13 లక్షలతో చేపట్టనున్న కల్వర్టు నిర్మాణ పనులకు ఆదివారం కార్పొరేటర్ శేనాపతి వసంత శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేనాపతి శం కరరావు, గుమ్మిడి.ధర్మ, శేనాపతి బుజ్జి, ముమ్మన శ్రీనివాసరావు, దారపు రాముడు పాల్గొన్నారు.

నడక మైదానంలో స్వచ్ఛ సర్వేక్షణ్

అగనంపూడి, జూలై 7: స్థానిక నడక మైదానంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మైదానంలోని చెత్తాచెదారాన్ని ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లను తొలగించి శుభ్రం చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.నరసింగరావు మాట్లాడుతూ నిత్యం వాకింగ్ చేసే మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న ఉద్దేశంతోనే స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బి.సత్యనారాయణ, కనకభవానీ, పైడిరాజు, ఎం.వెంకటరావు, అప్పలనాయుడు, బాబూరావు, చంద్రశేఖర్, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

సుభద్రానగర్‌లో శ్రమదానం

పెందుర్తి, జూలై 7; గ్రేటర్ 97వ వార్డు సుజాతనగర్ సమీపంలోని సుభద్రానగర్ కాలనీవాసులు ఆదివారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధుల్లో చెత్త చెదారాలు, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు . పార్కులో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. నగరం సుందరీకరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37,టమాటా 37, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 82, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 30, క్యారేట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 84, అల్లం (పాతది) 145, బరబటి 54, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 28, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 6లో..



బంగారు చీపురుతో రథాన్ని శుభ్రపరుస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్



అగనంపూడిలో రథయాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొన్న పల్లా, తదితరులు

వైభవంగా రథయాత్ర

జగన్నాథస్వామిని దర్శించేందుకు తరలివచ్చిన భక్తజనం

అగనంపూడిలో రథాన్ని లాగేందుకు పోటీపడిన భక్తులు


ఉక్కుటౌన్‌షిప్, జూలై 7: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో గల జగన్నాథ స్వామి ఆలయంలో రథయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. రథోత్సవంగా భాగంగా వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11 గంటలకు రథాన్ని ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజాది కార్యక్రమాలను జరిపారు. రథయాత్రను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ ప్రారంభించారు. తొలుత ఆయన బంగారు చీపురుతో రథాన్ని శుభ్రపరిచారు. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి రథయాత్రను స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో గల అన్ని సెక్టార్లలో నిర్వహించారు. అనంతరం సెక్టార్-12లో గల ఇంద్రజ్యుమ్న హాల్ వద్దకు తీసుకువెళ్లారు. పూరీలో మాదిరిగానే ఇక్కడ కూడా ఒరియా పంతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అగనంపూడిలో..

అగనంపూడి: అగనంపూడి, పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం జగన్నాథస్వామి రథయాత్ర వైభవంగా సాగింది. భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. తొలుత ఆలయంలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామికి ఒడిశా సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల నడుమ జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రలను రథంపై ఆశీనులను చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథం ముందు చీపురుతో శుభ్రం చేశాక రథయాత్రను ప్రారంభించారు. రథయాత్ర అగనంపూడి కూడలి మీదగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వరకు సాగింది. అనంతరం అక్కడ ఇంద్రజ్యుమ్న మందిరంలో స్వామివారిని ప్రతిష్ఠించి పూజలు జరిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మి, ఆలయ కమిటీ ప్రతినిధి కరణం పైడిరాజు, టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దోమేంద్రతో పాటు నాయకులు దాసరి త్రినాథరావు, జి.వెంకటరావు, కె.జగదీశ్, సత్యారావు, ఎస్.సింహాచలం, ఎం.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి-రూరల్: మండలం చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలోని శ్రీకృష్ణ గీతా మందిరంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాలలో భాగంగా స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుభద్ర, బలబద్ర, జగన్నాథమిలతో గోపాలకృష్ణ ఆలయం నుంచి లక్ష్మీపురం కూడలి వరకు అక్కడ నుంచి దుర్గానగర్ కాలనీ మీదగా చింతలఅగ్రహారం రామాలయం వరకు ఈ రథోత్సవం సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోలాటాలు ప్రదర్శించారు. జగన్నాథుని స్మరిస్తూ భజన గీతాలు ఆలపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.





అగనంపూడిలో రథయాత్ర పాల్గొన్న భక్తజనం (ఇన్‌సెట్లో) రథంలో ఆశీనులైన బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామి



గవరపాలెం కాలనీలో రథాన్ని లాగుతున్న భక్తులు

చీకటిమయంగా కొత్తపాలెం అండర్ పాస్‌వే

కొద్ది రోజులుగా ఈ మార్గంలో వెలగని లైట్లు

రాత్రిపూట రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్న ప్రజలు

గోపాలపట్నం, జూన్ 15: నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే కొత్తపాలెం అండర్ పాస్‌వేలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రయితే చాలు ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు భీతిల్లుతున్నారు. 89వ వార్డు పరిధి కొత్తపాలెంలోని అండర్‌పాస్‌వే మీదుగా సుమారు పది గ్రామాలకు చెందిన వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా అర్ధరాత్రి పన్నెండు గంటల వరకే అండర్ పాస్‌వే నుంచి వాహనచోదకులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అయితే గత కొంతకాలంగా ఈ అండర్‌పాస్‌వేలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో చీకటి పడితే చాలు ఈ మార్గంలో అంధకారం రాజ్యమేలుతోంది. చీకటిమయమైన ఈ మార్గంలో రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉంటుందని వాహనదారులు భయాం దోళన చెందుతున్నారు. అండర్ పాస్‌వే నుంచి రాకపోకలు సాగించే పాదచారులు, వాహన చోదకులపై చైన్ స్నాచర్లు, చిల్లర దొంగలు రాత్రిపూట చోరీకి యత్నించిన ఘటనలు గతంలో చోటుచేసుకున్నందున ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రోజులు తరబడి అండర్‌పాస్‌వేలో విద్యుత్ దీపాలు వెలగకపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అండర్ పాస్‌వేలో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అంధకారంగా ఉన్న కొత్తపాలెం అండర్ పాస్‌వే..

ఏజెన్సీ నుంచి ఉపాధ్యాయులను మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఏపీటీఎఫ్ నాయకుల విజ్ఞప్తి

గాజువాక, జూలై 7: మైదాన ప్రాంతాల నుంచి ఏజెన్సీకి బదిలీ అయిన సుమారు మూడు వందల మంది ఉపాధ్యాయులను తిరిగి మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో ఆయనను కలిసిన నాయకులు పలు విషయాలను విన్నవించారు. ప్రత్యేకమైన పరిస్థితుల్లో 2023 జూన్‌లో 300 మంది ఉపాధ్యాయులకు ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేశారని, వీరిలో 50 ఏళ్లు పైబడిన వారు, మహిళలు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రాథమిక విద్యా వ్యవస్థను కుదేలు చేసిన జీవో నంబర్-117ను రద్దు చేయాలని, 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాల నుంచి తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోకి తీసుకురావాలని కోరారు. పల్లాను కలిసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కరుణాకరరావు, ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, ఉపాధ్యక్షురాలు రాజన మంగమ్మ, తదితరులు ఉన్నారు.



పల్లాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

8 కిలోల గంజాయి పట్టివేత: మహిళ అరెస్టు

కూర్మన్నపాలెం, జూలై 7: గంజాయి రవాణా చేస్తున్న మహిళను దువ్వాడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా సబ్బవరం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు దువ్వాడ నాగదేవత కొండ వద్ద మాటు వేసి పోలీసులు వాహనాల తనిఖీని చేపట్టారు. ఓ బస్సులో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన కె.చిలకమ్మ అనే మహిళ దువ్వాడ రైల్వే స్టేషన్‌కు పాలిథిన్ బ్యాగుల్లో సుమారు ఎనిమిది కిలోల గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ మేరకు గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు అమెను అరెస్టు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

500 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

కూర్మన్నపాలెం, జూలై 7: అనధికారంగా పీడీఎస్ రైస్‌ను తరలిస్తున్న వాహనాన్ని దువ్వాడ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక సమీపంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన తంపర బలరామ్ అనే వ్యక్తి వ్యాన్‌లో పెదగంట్యాడ నుంచి చింతపల్లికి 500 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో వడ్లపూడి జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అందజేశారు.

అమ్మవారి ఆలయ నిర్మాణ నూతన కమిటీ ఏర్పాటు

గాజువాక, జూలై 7: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు ప్రాంత పైడిమాంబ అమ్మవారి ఆలయ నూతన నిర్మాణ కమిటీని గ్రామ పెద్దలు తాటికొండ కాశీవిశ్వేశ్వరరావు, మంత్రి గోపినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్లుగా మంత్రి శంకర్ నారాయణ, ములంపాక అచ్చింనాయుడు, కోశాధికారిగా బత్తిన నాగభూషణం, సభ్యులుగా తాటికొండ సుదర్శనరావు, సియ్యాద్రి అప్పలరాజు, నరవ శ్రీను, నాగరాజు, జగదీష్‌లతో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు.

ఎస్సీ రిజర్వేషన్లను విభజించాలి

అక్కిరెడ్డిపాలెం, జూలై 7: ఎస్సీ రిజర్వేషన్లను ఏ,బీ, సీ, డీలుగా విభజించినప్పుడే మాదిగలతో పాటు ఇతర ఉప కులాల అభివృద్ధి సాధ్యమని మాదిగ రిజర్వేషన్ పోరాట కమిటీ రాష్ట్ర నాయకుడు దేవులపల్లి సంపూర్ణం అన్నారు. 69వ వార్డు పరిధి హరిజన జగ్గయ్యపాలెంలో ఆదివారం జరిగిన మాదిగ రిజర్వేషన్ పోరాట కమిటీ 30వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన పాల్గొని ఎమ్మార్పీస్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాదిగ చేపడుతున్న ఉద్యమానికి మాదిగలందరూ మద్దతు పలికి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకుడు పెట్ల వెంకటరమణ, జిల్లా నాయకులు ఉప్పాటి ప్రవీణ్, వంగలపూడి గోపి, జి.రామాంజనేయులు, రవి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక దినోత్సవం మల్కాపురం ఎస్సీ కాలనీలో దండోరా వర్కర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు దండోరా జెండాను అ విష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ జరిగితేనే అన్ని వర్గాల దళితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఆర్‌పీఎస్‌కు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు.

62వ వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి

సింధియా, జూలై 7: తెలుగుదేశం పార్టీ 62వ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ కమిటీ సమీక్ష నిర్వహించారు. వార్డులో నెలకొన్న పు సమస్యలపై గ్రామ సభ్యులతో చర్చించారు. దుర్గానగర్ కొండవాలు ప్రాంతలో ఉన్న వాటర్ ట్యాంకు, వీధి దీపాలు, రోడ్ల నిర్మాణాలు, తదితర పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు గ్రామ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆయా సమస్యలను ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మాలినాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.సూరిబాబు, అప్పలరెడ్డి, రామిరెడ్డి, శ్రీను, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

63వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

సింధియా, జూలై 7: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్, కాకరలోవ గామాల్లో ఆదివారం కార్పొరేటర్ గల్లా చిన్నా పర్యటించారు. క్రాంతినగర్ కృష్ణుడి ఆలయం వద్ద రోడ్డు వేయాలని స్థానికులు కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాకరలోవలో పైపులైన్ల మరమ్మతులను పరిశీలించారు. స్థానిక నాయకులు కృష్ణ, బాబూరావు, కృష్ణ, పాల్గొన్నారు.



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

ఘనంగా దుర్గమాంబ పండగ

60 ఏళ్ల తర్వాత నిర్వహించడంతో

అమ్మవారిని దర్శించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

మల్కాపురం, జూలై 7: మల్కాపురంలో దైవదేవ జాలర్ల కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దుర్గమాంబ పండగను ఘనంగా ప్రారంభించారు. ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ సమీపంలో ఉన్న ఆలయం నుంచి అమ్మవారిని మంగళ వాయిద్యాల నడుమ జాలరవీధికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ పండగను 60 ఏళ్ల తర్వాత నిర్వహించడంతో అధిక సభ్యులు విచ్చేసి దుర్గమాంబను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. 1964లో పెద్దలు గ్రామ సంక్షేమం కోసం అమ్మవారి పండగను జరిపారు. మళ్లీ ఇన్నేళ్లకు దుర్గమాంబ పండగను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జాలర్ల సంఘం ప్రతినిధులు గ్రామంలో ఉన్న అన్ని కుల సంఘాల వారికి ఆహ్వానం పలికారు. అరవై సంవత్సరాల తర్వాత అమ్మవారి పండగను జరపడంతో ఆలయానికి వందలాది భక్తులు తరలిరావడంతో ప్రకాశ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం కూడా ఈ ఉత్సవాల్లో భాగస్వామ్యమైంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

సింధియా, జూలై 7: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం యారాడ గ్రామంలో పర్యటించిన ఆయనకు పలువురు గ్రామస్థులు స్థానిక సమస్యలను నివేదించారు. ముఖ్యంగా వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిపూట బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని, దీంతో దొంగల బెడద అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రయ్యేసరికి విష సర్పాలు ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని వాపోయారు. అందువల్ల గ్రామంలో వీధి దీపాలు వేయించేందుకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వీధి దీపాల సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా శ్రీనివాసరావు హామీ ఇవ్వడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని గణబాబుకు వినతి



గణబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్‌సీ-ఈయూ ప్రతినిధులు

మల్కాపురం, జూలై 7: నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎన్‌సీఈయూ) కార్మికులు, ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పీజీవీఆర్ నాయుడు (గణబాబు)నుకలిసి యూనియన్ ప్రతినిధులు ఆదివారం వినతి పత్రమిచ్చారు. ఓవర్ టైమ్ పనిగంటలు 114 నుంచి 150 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఫ్యాక్టరీస్ యాక్ట్ 1948 నుంచి మినహాయింపు చేయాలని కోరారు. షీలానగర్ , ఎస్‌బీసీ వద్ద టోల్‌గేట్లను శాశ్వతంగా తొలగించాలని, కార్మికులకు విధులకు హాజరయ్యే సమయాలలో గొడౌన్స్ సమీపంలో ఉన్న రైలుగేట్లు మూసేస్తుం డడంతో కార్మికులకు ఇబ్బందులు తలెత్తున్నాయని తెలిపారు. వెంటనే రెండు చోట్ల ఫ్లైఓవర్లు నిర్మించాలని కోరారు. సర్దార్ వల్లాబాయ్ పటేల్ వంతెనను మరమ్మతు చేసే సమయంలో ఎస్‌బీసీ బ్రిడ్జి ప్రయాణాలు సాగేలా అనుమతులు తేవాలని కోరారు. ముంబాయి రక్షణ రంగంలో ఓటీలపై అన్ని అలవెన్స్‌లు ఇస్తున్నారని, వి శాఖ డాక్‌యార్డులో ఇలా అమలు చేయడంలేదని పేర్కొన్నారు. వీటిపై ఎమ్మెల్యే గణబాబు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీయూ యూనియన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అరుణకుమార్, అదనపు కార్యదర్శి భాను, కార్యనిర్వాహక అధ్యక్షులు డి. మోహన్‌రావు, నాగార్జున, పీఎంఎల్ నాయుడు, వరప్రసాద్, పరమేష్, గణేష్, విజయ్, సత్యనారాయణ, టీఎస్‌టీయూసీ ఈఎన్‌సీ అధ్యక్షులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ధార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా 'చలపాక'

అక్కిరెడ్డిపాలెం, జూలై 7: అఖిల భారత అయ్యప్ప ధార్మిక సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర కార్యదర్శిగా చలపాక నాగార్జున ఎన్నికయ్యారు. చీరాలలో ఆదివారం జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయానికి చెందిన మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం అధ్యక్షుడు నాగార్జునను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సంఘం నిర్వహించే కార్యక్రమాలను విశాఖలో చేపట్టేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



చలపాక నాగార్జున

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూలై 7: ఉక్కు కర్మాగార పరిరక్షణకు ఐక్య పోరాటాలే శరణ్యమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,242వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లోనైనా విలీనం చేయాలని, లేకుంటే ప్రభుత్వ రంగంలోనైనా నడపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్రం మొండి వైఖరిని విడనాడాలన్నారు. ఇంటక్ ప్రధాన కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరూ పోరాటం సాగించి ఆంధ్రుల హక్కు అయిన ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలన్నారు. ఉద్యోగులతో పాటు ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, మహిళలు, యువత ఉక్కు పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నగేశ్, సుబ్బయ్య, నాగిరెడ్డి, సింహాచలం, రమణ, వంశీ, రామారావు, గోపి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్య ఆత్మవిశ్వాసాన్ని పెంచేదిగా ఉండాలి

మల్కాపురం., జూలై 7: విద్య ఆత్మవిశ్వాసాన్ని, మానవతా విలువలు, దేశభక్తి పెం పొం దించేలా ఉండాలని రామకృష్ణ మిషన్ స్వామిజీ స్వశంవేద్యానందాజీ అన్నారు. రామకృష్ణమిషన్‌లో యువత అభివృద్ధి అన్న అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు , వలంటీర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. స్వామి వివేకానందుడు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు ఇపీఎస్ భాగ్యలక్ష్మి, అనసూయదేవీలను జాతీయ సేవ పథకం ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ ప్రశంసా పత్రాలందించి సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రోగ్రామ్ అధికారులు ఉమామహేశ్వరరావు, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ అర్చన, డాక్టర్ సీహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కుసుమ హరనాథకు ప్రత్యేక పూజలు

కూర్మన్నపాలెం, జూలై 7: జీవీఎంసీ 86వ వార్డు పరిధి దువ్వాడలో కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆయన జయంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి దివ్య హారతి, కుంకుమ పూజలు జరిపారు. జయ హరనాథ, జయ కుసుమకుమారి, జయ అను షోడశాక్షరి 24 గంటలు పాటు ఏక నామంతో సప్తాహం చేపట్టారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బాబాజీ, రమేశ్, ఎంవీ రాజశేఖర్, మంగరాజు, అన్నాజీరావు, శివసీతారాం, తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ లూక్స్ కార్యకలాపాలపై విచారణ

విశాఖపట్నం/ఎండాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎండాడలో సెయింట్ లూక్స్ విద్యా సంస్థకు కేటాయించిన భూమిలో కార్యకలాపాలపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. విశాఖ రూరల్ తహసీల్దారు కార్యాలయం సిబ్బంది రెండు రోజుల క్రితం ఎండాడలో సెయింట్ లూక్స్ సంస్థ ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సెయింట్ లూక్స్ విద్యా సంస్థకు ఎకరా రూ. 5 లక్షల వంతున 7.5 ఎకరాలు కేటాయించారు. విద్యా కార్యకలాపాల కోసం ఇచ్చిన స్థలంలో ఎంత మేరకు అనుకున్న మేర వినియోగిస్తున్నారు ? అన్న దానిపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు భీమిలి ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం కేటాయించిన భూమిలో వినియోగం ఎంత, విద్యా కార్యకలాపాల కోసం ఉన్న భవనాలు ఎన్ని ? వాటి విస్తీర్ణం ఎంత ? ఇతరత్రా అవసరాలకు వినియోగిస్తున్నారా? అన్న కోణంలో విచారించి నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ విశాఖ రూరల్ తహసీల్దారును ఆదేశించడంతో రెండు రోజుల క్రితం ఆర్ఐ ప్రవీణ, సర్వేయర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. నివేదికను భీమిలి ఆర్డీవోకు నివేదించారు. అయితే భూమి కేటాయింపు సమయంలో పేర్కొన్న నిబంధనల మేరకు భూ వినియోగం ఉందా ? లేదా అన్న దానిపై చేపట్టిన విచారణ వివరాలు బయటకు రాలేదు. కాగా సెయింట్ లూక్స్ సంస్థకు భూ కేటాయింపులపై తొలి నుంచీ విమర్శలు ఉన్నాయి. రాజశేఖరరెడ్డి హయాంలో క్రిస్టియన్ మైనార్టీ విద్యా సంస్థకు కారుచౌకగా భూమి కేటాయింపులు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సెయింట్ లూక్స్ విద్యా సంస్థపై విచారణ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఘనంగా ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం

మద్రిపాలెం, జూలై 7: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) 30వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం 53వ వార్డులో ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంఆర్పీఎస్ జెండాను పోరాట సమితి నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ30 ఏళ్లగా మాదిగ రిజర్వేషన్ కోసం మంద కృష్ణ మాదిగ చేస్తున్న కృషి అందరికీ ఆదర్శనీయమన్నారు. ప్రతి ఒక్కరు ఆయనకు మద్దతుగా నిలుస్తూ తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. అనరంతం మంద కృష్ణమాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అలాగే, వరంగల్‌లో త్వరలో జరిగే కవాతుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఎస్పీ ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ యల్ల బిల్లి గోవిందరాజు, గంట్యాడ చిన్నఅప్పలరాజు, ముప్పిడి దేవేశ్వరరావు, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









పూజలు చేస్తున్న పీఠాధిపతి త్రిదండి స్వామి కేశవ గోస్వామి మహరాజ్..., రథాన్ని లాగుతున్న భక్తులు, వన్‌టౌన్‌లో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు

ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర

మహారాణిపేట, జూలై 7: జడ్పీ జంక్షన్‌లో ఉన్న శ్రీ కృష్ణమందిరం చెందిన కృష్ణ చైతన్యమఠం వద్ద పీఠాధిపతి త్రిదండి స్వామి కేశవ గోస్వామి మహరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథ స్వామి రథయాత్రను నిర్వహించారు. బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామిలతో సాగర తీరంలోని ఆర్‌బీచ్ వద్దనుంచి ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. కృష్ణభక్తులు, వైష్ణవులు, సన్యాసులు, భక్త బృందాల హరినామ సంకీర్తనలు, కోలాటాలు, గంటానాదాలతో కోస్టల్‌బ్యాటరీ, కలెక్టరేట్ జంక్షన్ మీదుగా జడ్పీ వద్ద కృష్ణ మందిరం వరకు రథయాత్ర కొనసాగింది. పెద్దఎత్తున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జగదాంబ: వన్‌టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథ రథయాత్ర ఘనంగా సాగింది. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ



శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

అక్కయ్యపాలెం, జూలై 7 : రాజస్థాన్ ఉదయపూర్‌కు చెందిన నారాయణ సేవా సంస్థన్ ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలో ఆదివారం దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ నారాయణ సేవా సంస్థ ప్రపంచ వ్యాప్తంగా వివిధ చోట్ల దివ్యాంగులకు ఉచిత సేవలందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపడం గొప్పవిషమని అన్నారు. నగరంలో సుమారు 350 మందికి శిబిరం ద్వారా ఉచిత కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. సంస్థాన్ అధ్యక్షుడు అగర్వాల్ మాట్లాడుతూ రాజస్థాన్‌లో తమకు 1100 పడకల ఆస్పత్రి నిర్వహిస్తున్నామని, జర్మనీ టెక్నాలజీతో రూపొందిస్తున్న కృత్రిమ చేతులు, కాళ్ల తయారీకి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి రోజూ 80 నుంచి 100 ఆపరేషన్లు చేయడంతో పాటు అనేకమంది దివ్యాంగులకు ఉచితంగా వసతి, భోజనం, ఆర్థిక వనరులు సమకూరుస్తూ గత 39 ఏళ్ళుగా సేవలందిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కం దుల నాగరాజు, విశ్వనాథ్ కన్వెన్షన్ అధినేత కాశీ విశ్వనాథ్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రోటరీ సేవలు ఆదర్శం: ఎంపీ శ్రీభరత్



కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, తదితరులు

డాబాగార్డెన్స్, జూలై 7: ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్పవిషయమని విశాఖ ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ మూడవ విశాఖ స్థాపన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. జాన్సన్ కంట్రోల్స్ హిటాచి ఎయిర్ కండిషనింగ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.వాసుదేవన్ పాల్గొన్నారు. 2024-25 అధ్యక్షునిగా మహమ్మద్‌యాసీన్, కార్యదర్శిగా చింతా నేతాజీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగరాజు, బి.శంకరరావు, సభ్యులు పాల్గొన్నారు.

వాల్తేరు డివిజన్ నూతన సీనియర్ డీసీఎం-2గా పవన్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న పవన్‌కుమార్

విశాఖపట్నం, జూలై 7: తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ కొత్త సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్-2గా కే పవన్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సివిల్ సర్వీసెస్ 2016 ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసెస్ (ఐఆర్‌టీఎస్) బ్యాచ్‌కు చెందిన పవన్‌కుమార్.. సౌత్ వెస్ట్రన్ రైల్వే ఫ్రైట్ ఆపరేషన్స్ ఏరియా ఆఫీసర్ హోస్పేట్‌గా, హుబ్లి డివిజన్ గూడ్స్ ఆపరేషన్స్ డీవోఎంగా పనిచేశారు. సౌత్ వెస్ట్రన్ రైల్వేలో సరకు రవాణా కార్యకలాపాలలోచురుకైన బాధ్యతలు నిర్వర్తించి 2021-22 లో పీసీవోఎం, జీఎం అవార్డులందుకున్నారు. కాగా వాల్తేరు డివిజన్‌డీసీఎం పనిచేస్తున్న ఏ అవినాష్‌కు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా (జనరల్) పదోన్నతి లభించినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి చదరంగం పోటీలు



విజేతలతో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 7: ఆల్ వైజాగ్ చెస్ సంఘం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-11 చెస్ పోటీలు కమ్ జిల్లా జట్టు ఎంపికలు ఆదివారం ముగిశాయి. బుల్లయ్య కాలేజీ ఆవరణలో జరిగిన ఈ టోర్నీ ఓపెన్ కేటగిరిలో అనిపిండి వంశీ (6.5 పాయింట్లు), వాసిరెడ్డి అర్జున్ (6 పాయింట్లు)...బాలికల విభాగంలో దివ్య దర్శిని మోయిదా (5.5), పితాని సత్య శ్రీ విద్య (5) తొలి రెం డు స్థానాలలో నిలిచారు. విజేతలకు ఆల్ వైజాగ్ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ చిన్నారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మణికంఠరావు, ఉమామహేశ్వరరావు, కామేష్, ఎంవీఎస్.ప్రసాద్‌పాల్గొన్నారు.

భూ వివాదంపై సీపీకి ఎన్ఆర్ఐ దంపతుల ఫిర్యాదు

విశాఖపట్నం/భీమునిపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమ భూమిని మంచి ధరకు అమ్మి పెడతానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై చర్యలు కోవాలని కోరుతూ న్యూజిలాండ్‌లో ఉంటున్న దంపతులు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై భీమిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన కందికట్ల విద్యా సంజీవ్, పేరం సంజీవ్ విజయకుమారి దంపతులు 18 ఏళ్లగా న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో నివాసం ఉంటున్నారు. వారు భీమిలి మండలం కాపులుప్పాడ-గొల్లల తిమ్మాపురం వద్ద సర్వే నంబరు 328/19లో 968 గజాల స్థలాన్ని 2006లో కొనుగోలు చేశారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే నంబర్ తప్పుగా పడినప్పటికీ ఎన్ఆర్ఐ దంపతులు గుర్తించలేదు. తర్వాత ఆ భూమిని విక్రయించాలని ఎన్ఆర్ఐ దంపతులు ప్రయత్నాల్లో భాగంగా కొండపల్లి రుమాంబ 2022లో జీపీఏ చేశారు. కాగా రుమాంబ ఆ భూమిని ఎవరూ కొనడం లేదంటూ మభ్యపెడుతూ రావడంతో ఇటీవల ఆ దంపతులు తమ భూమి వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించగా 2024 ఏప్రిల్‌లోనే ఆ భూమిని వేరొకరికి విక్రయించేసినట్టు గుర్తించారు. దీంతో తమను మోసం చేసిన రుమాంబపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు సీపీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీపీ భీమిలి సీఐని ఆదేశించారు.

చోరీలకు పాల్పడిన 69 మంది అరెస్టు

▸ రూ. 37 లక్షల చోరీ సొత్తు స్వాధీనం సీపీ శంఖబ్రతబాగ్చి



చోరీ సొత్తును పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పలు చోరీలకు పాల్పడిన 69 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.37.12 లక్షల విలువైన సొత్తుని స్వాధీనం చేసుకున్నారు. ఆయా కేసుల్లో బాధితులకు రికవరీ సొత్తును అందజేసేందుకు పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం 'రికవరీ మేళా' ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ నగరంలో గత నెలలో 99 చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. ఆయా కేసుల్లో రూ.78.60 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైందన్నారు. వీటిలో 66 కేసులను చేధించామన్నారు. గతంలో జరిగిన చోరీలకు సంబంధించి మరో 14 కేసులను కూడా చేధించామన్నారు. మొత్తంగా 80 కేసులను చేధించామని తెలిపారు. వీటిలో దోపిడీ ఒకటి, పగటి దొంగతనాలు మూడు, రాత్రి పూట ఇళ్లలో చోరీలు, ఆటో, కారు చోరీలు, 16 సాధారణ చోరీలు, తొమ్మిది చైన్‌స్నాచింగ్‌లు, 24 మోటారుసైకిళ్లచోరీలు, ఏడు వైర్ల చోరీలు, జేబు దొంగతనం ఒకటి, మిగిలిన ఇతర చోరీలకు సంబంధించిన కేసులు ఉన్నాయని తెలిపారు. ఆయా నేరాలకు పాల్పడిన 69 మందిని అదుపులోకి తీసుకుని రూ. 37. 12 లక్షల విలువ చేసే 381.93 గ్రాముల బంగారం, 501.36 గ్రాముల వెండి, రూ.7.94 లక్షలు నగదు, 24 బైక్‌లు, ఒక ఆటో, కారుతో పాటు ఇతర విలువైన సొత్తు రికవరీ చేశామన్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో 12 మంది మైనర్లు ఉన్నారన్నారు. చోరీ నియంత్రణలో భాగంగా నగరంలో రాత్రి పెట్రోలింగ్‌ను బలోపేతం చేశా మని, గత నెలలో 338 సీసీ కెమెరాలు కొత్తగా ఏర్పాటు చేశామని, చోరీల నియంత్రణకు 120 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. నేరాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్రైమ్ బీట్‌లు వేస్తున్నామన్నారు. 2022లో 820 చోరీలు నమోదు కాగా రూ.5.79 కోట్ల సొత్తు అపహరణకు గురైందన్నారు. వీటిలో 660 కేసులు చేదించి రూ. మూడు కోట్ల విలువైన సొత్తుని రికవరీ చేశామన్నారు. గత ఏడాది 678 చోరీకేసుల్లో రూ.5.29 కోట్లు సొత్తు అపహరణకు గురైతే, వాటిలో 482 కేసులు చేధించి రూ.3.36 కోట్లు విలువైన సొత్తు రికవరీ చేశామన్నారు. 2024లో ఇప్పటివరకూ 504 చోరీలు జరిగితే వీటిలో 333 కేసులను చేధించామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప, క్రైమ్ డీసీపీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర లయన్స్‌పై రాయలసీమ కింగ్స్ గెలుపు


విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 7: ఏపీఎల్ సీజన్-3 టోర్నీలో భాగంగా ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఆరు వికెట్ల తేడాతో ఉత్తరాంధ్ర లయన్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఉత్తరాంధ్ర లయన్స్ నిర్ణీత 20 ఓవర్లలో పది వికెట్లకు 121 పరుగులు చేసింది. బ్యాటింగ్ ప్రారంభించిన ఏడు బంతుల్లోనే ఓపెనర్లు గుల్ఫామ్ (4), తరుణ్ (1) అవుట్‌కాగా, వారి స్థానాలలో దిగిన తపస్వి (20), శ్రీరామ్ వెంకట రాహుల్ (20) కొద్దిసేపు ఆదుకునే ప్రయత్నం చేశారు. తర్వాత వచ్చిన బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేక పెవిలియన్ దారి పట్టారు. రాయలసీమ బౌలర్లలో గిరినాథరెడ్డి, షేక్ మహ్మద్ రఫీ, బి.వినయ్ తలో రెండు వికెట్లు పడగొట్టగా సత్యనారాయణరాజు, ఆంజనేయులు చెరో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ 17.3 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 122 పరుగులతో లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా డీబీ ప్రశాంత్ కుమార్, గేమ్ ఛేంజర్‌గా గిరినాథరెడ్డి అవార్డులందుకున్నారు.

గోదావరి టైటాన్స్‌పై వైజాగ్ వారియర్స్ గెలుపు

ఏపీఎల్ క్రికెట్ సాయం త్రం జరిగిన మరో మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ ఎనిమిది వికెట్ల తేడాతో గోదావరి టైటాన్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 164 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన వైజాగ్ వారియర్స్ 15.5 ఓవరలో కేవలం రెండు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది.

సరికొత్త ఫీచర్లతో ఈపీడీసీఎల్ మొబైల్ యాప్

▸ ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వినియోగదారుడి 16 అంకెల సర్వీసు నెంబరు నమోదు చేసుకోవడం ద్వారా యాప్ సేవలను పొందవచ్చన్నారు. యాప్‌లో బిల్ పే ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎటువంటి అదనపు రుసుం లేకుండా అత్యంత సుల భతరంగా చెల్లించవచ్చని వివరించారు. వినియోగ దారుడి సర్వీసుకు సం బంధించిన విద్యుత్ విని యోగం, బిల్లు వివరాలు, చెల్లింపు, సరఫరా పరిస్థితి తదితర వివరాలను కూడా తెలుసు కోవచ్చన్నారు. మై యూసెజ్ ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్ లో ఉన్న రీడింగ్ ప్రకారం కేవలం వినియోగపు యూనిట్లను సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించు కోవచ్చన్నారు. యాప్ ద్వారా ఆధార్ నెంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవ డంతో పాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చన్నారు. పేటీఎం, ఫోన్ పే, జీపేతో సహా ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు నేరుగా చెల్లించే విషయంపై ఆర్‌బీఐ అభ్యం తరం వ్యక్తం చేసినప్పటికీ పాత విధా నంలోనే ఫోన్ పే, పేటీఎం, జీ పేలు ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లిం చేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు వెల్ల డించారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ లో గాని, సంస్థ వెబ్‌సైట్‌లో గాని బిల్లులు చెల్లించే సమయంలో వినియోగ దారులు తమ ఫోన్ పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌తో పాటు నెట్‌బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులు, వాలెట్స్, క్యాష్ కార్డ్ కూడా వాడుకోవచ్చని సీఎండీ పేర్కొన్నారు.

69వ వార్డు కార్పొరేటర్ గోవిందరెడ్డిపై కేసు నమోదు

▸ దౌర్జన్యంపై భార్యాభర్తల ఫిర్యాదు

గాజువాక, జూలై 7: భార్యాభర్తలపై దౌర్జన్యానికి పాల్పడిన ఆరోపణలపై గ్రేటర్ 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డిపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. రెడ్డి తుంగ్లాం ప్రాంతానికి చెం దిన కొల్లి సత్యవతి చీటీల నిర్వహణలో భాగంగా అప్పులపాలయ్యారు. దీంతో చీటీలు పాడుకున్న వారికి సకాలంలో నగదు చెల్లించకపోవటం, వారి నుంచి ఒ త్తిడి వస్తుండంతో సత్యవతి, ఆమె భర్త సురేష్‌తో కలిపి కార్పొరేటర్ గోవిందరెడ్డి ఇంటికి ఇటీవల వెళ్లి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. ఈ క్రమంలో అప్పులకు సంబంధించి వివరాలను వెల్లడించి, వీటిని తీర్చలేని పరిస్థితుల్లో ఉన్నామని చె ప్పారు. సత్యవతికి చెందిన సుమారు రూ. 2 కోట్ల విలువైన ఇంటిని తనకు విక్రయిస్తే అప్పులు ఇవ్వాల్సిన వారందరికీ నగదు చెల్లిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. దీంతో ఈ ఏడాది మే 19న సదరు ఇంటిని కార్పొరేటర్ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. అయితే, రెండు నెలలు గడుస్తున్నా, ఏ ఒక్కరికీ అప్పు చెల్లించకపోవటంతో చీటీదారులు సత్యవతి ఇంటికి వెళ్లి గొడవకు దిగుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం చీటీ నిర్వాహకురాలు సత్యవతి, భర్త సురేష్‌లు కార్పొరేటర్ గోవిందరెడ్డి ఇంటికి వెళ్లి అప్పులు తీర్చకపోవడం నిలదీశారు. అప్పుల వారు త మ ఇంటికి వచ్చి గొడవకు దిగుతున్నారని తెలిపారు. దీంతో గోవిందరెడ్డి ఆగ్ర హించి సత్యవతిపై దుర్భాషలాడి, చేయిచేసుకున్నారు. ఆమె భర్త సురేష్‌ను ఇం టినుంచి బయటకు తోసేశాడు. దీంతో భార్యాభర్తలిద్దరు నేరుగా గోవిందరెడ్డి దౌర్జన్యంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారు

అక్కయ్యపాలెం, జూలై 7 : గ్రేటర్ 26వ వార్డు లలితానగర్‌లోని లలితాపీఠంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించి పూజించడం వల్ల భూ సంబంధిత వ్యవహారాల పరిష్కారం, శత్రునాశనం, ఆరోగ్యం, మానసిక సమస్యల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న రోటరీ సభ్యులు

డాబాగార్డెన్స్, జూలై 7: అత్యవసర సమయంలో రక్త నిల్వలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని ఆర్‌టీఎన్ ఏకేఎస్ భాస్కరవర్మ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ ఎలీట్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర మిశ్రా నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి కార్యదర్శి రమణరావు, జైన్ హాజరై జ్యోతి ప్రజ్వలనగావించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్ రాఘవేంద్రమిశ్ర, సెక్రటరీ బీవీ రమణరావులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రాథోర్, సభ్యులు పాల్గొన్నారు.

చెట్లపై అధ్యయనం

... 3వ పేజీ తరువాయి

విజయనగర ప్యాలెస్ (పెదవాల్తేర్ రోడ్డుకు ఆనుకుని)లోని ప్రవేశాల డైరెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మర్రిచెట్టు వయసు 200 ఏళ్ల దాటి ఉంటుందని గుర్తించారు. సిరిపురం జంక్షన్‌కు ఆనుకుని ఏయూలో మరో మర్రిచెట్టు, దొండపర్తి ఎరుకుమాంబ దేవాలయం ముందు రావి చెట్టు, అదే ప్రాంతంలోని పరదేశమ్మ గుడి సమీపంలో ఓ చెట్టు, అక్కయ్యపాలెం రోడ్డు జగ్గారావు బ్రిడ్జి, రైల్వేకాలనీల్లో పలుచోట్ల మర్రి, రావి, కాగు చెట్లు, టౌన్‌హాలు వద్ద రెండు మహావృక్షాలు, కంచరపాలెం, మర్రిపాలెం తదతర ప్రాంతాల్లో 50ఏళ్ల వయసు దాటిన చెట్లను గుర్తించారు. నగరంలో చెట్ల వివరాలపై పూర్తిస్థాయిలో డాక్యుమెంటేషన్ రూపొందించేందుకు మరికొంత సమయం పడుతుందని ఆచార్య కామేశ్వరరావు తెలిపారు.

పర్యావరణానికి మేలు...

ఏయూ ప్రవేశాల డైరెక్టరేట్ వద్ద ఉన్న చెట్ల కారణంగా భూగర్భజలాల పరిరక్షణ సాధ్యమవుతుందని ఆచార్యులు చెబుతున్నారు. ఒక్కో చెట్టు తన జీవితకాలంలో సుమారు 500 టన్నుల బొగ్గుపులుసు వాయువును పీల్చుకుంటాయని, ఏళ్లతరబడి ఉన్న మహా వృక్షాలవల్ల భూగర్భజలాల పరిరక్షణ, భూమి కోత నివారణ, ఆక్సిజన్ విడుదల, బొగ్గుపులుసు వాయువు పీల్చుకోవడంతో పాటు వేలాది మందికి చల్లనినీడను అందిస్తాయన్నారు.ఇంకా వేల రకాలైన పక్షులు, క్రిమికీటకాలు చెట్లపై జీవిస్తాయని, పర్యావరణంతోపాటు జీవవైవిధ్యం కాపాడేందుకు చెట్లు సాయపడతాయన్నారు. నగరం, పరిసరాల్లో 50 ఏళ్ల వయసు దాటిన చెట్ల వివరాలపై సమగ్రంగా డాక్యుమెంటేషన్ రూపొందించి ప్రజలకు అందించాలన్నదే తమ ధ్యేయమని, తద్వారా వాటి పరిరక్షణకు వీలు కల్పించినట్లు అవుతుందని పేర్కొన్నారు.

పోలీస్ శాఖలో 7995095799 నంబర్ టెర్రర్

... 3వ పేజీ తరువాయి

ఉన్నప్పటికీ, కొద్దిమందిలో సీపీగా బాధ్యతలు చేపట్టిన సమయంలో హడావుడి చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైంది. అలాంటి వాటిని పటాపంచలు చేస్తూ హెల్ప్‌లైన్ నంబర్‌కు వచ్చిన సమాచారం ఆధారంగా ఆదివారం చర్యలు చేపట్టడం పోలీస్‌శాఖతో పాటు నగరవాసుల్లో చర్చనీయాంశంగా మారింది.

వీడియో ఆధారంగా చర్యలు

పోర్టు నుంచి వచ్చే లారీలు ఇతర భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించడం నిషిద్ధం. పోర్టు నుంచి నేరుగా షీలానగర్ జంక్షన్‌కు వెళ్లి, అక్కడి నుంచి అటు గాజువాక, ఇటు ఎన్ఏడీ జంక్షన్ వైపు వెళ్లాలి. దీనివల్ల రోడ్డు ప్రమాదాల నివారణకు వీలుంటుంది. కానీ నగరంలో రాత్రి పది గంటల తర్వాత ట్రాఫిక్ తక్కువగా ఉండే నేపథ్యంలో పోర్టు నుంచి వాహనాలు డాబాగార్డెన్స్ మీదుగా మద్దిలపాలెం, అటు రైల్వేస్టేషన్ మీదుగా తాటిచెట్లపాలెం జంక్షన్‌కు వెళుతుంటాయి. వాటిని ఆపి, కేసులు నమోదుచేయాల్సిన పోలీసులు లారీడ్రైవర్ల నుంచి డబ్బులు తీసుకుని వదిలేస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోర్టు నుంచి కాన్వెంట్ జంక్షన్‌మీదుగా డాబాగార్డెన్స్‌వైపు వెళ్తున్న లారీని నైట్‌డ్యూటీలో ఉన్న హార్బర్ పోలీస్‌స్టేషన్ క్రైమ్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వర్మ ఆపారు. లారీని స్టేషన్‌కు తరలించాలని బెదిరించారు. డ్రైవర్ బతిమలాడుకోవడంతో డబ్బులు ఇస్తే వదిలిపెడతానన్నారు. దీనికి డ్రైవర్ అంగీకరించడంతో తనతోపాటు నైట్‌డ్యూటీలో ఉన్న హోంగార్డు పి.శేషుని పంపించి డ్రైవర్ నుంచి డబ్బులు వసూలుచేశారు. ఈ దృశ్యాన్ని కొంతదూరం నుంచి ఎవరో వీడియో తీశారు. దానిని సీపీ హెల్ప్‌లైన్ నంబర్‌కు పంపించారు. తెల్లవారే సరికి సదరు హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీచేయడంతో ఒక్కసారిగా పోలీస్‌వర్గాలు ఉలిక్కిపడ్డాయి. సీపీ మాటల మనిషి కాదని, చేతల మనిషేనని అభిప్రాయపడుతున్నారు. ఈ చర్యలతో ఏక్షణంలో ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనని పోలీస్‌శాఖలోని అవినీతిపరులు బిక్కుబిక్కుమంటున్నారు.

అవినీతిపరుల్లో వణుకు

ఈ దశలో నగరంలో పనిచేస్తున్న ఎస్ఐలు, సీఐల్లో కొందరు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోవడమే మేలనే భావనలో ఉన్నారు. నగరంలో పనిచేసేందుకు ఉబలాటపడుతున్న ఇతర జిల్లాల్లోని పోలీస్ అధికారులు సైతం నగరానికి రావడానికి ఇప్పుడు వెనుకడుగు వేస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఏదిఏమైనా క్రైమ్ హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయడం ద్వారా సీపీ భవిష్యత్తులో తనచర్యలు ఎలా ఉండబోతున్నాయనే సంకేతాన్ని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఇచ్చారని నగరవాసులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా భవిష్యత్తులో కూడా సీపీ ఇదే పనితీరును కొనసాగించాలని కోరుతున్నారు.

మేహాద్రిగెడ్డకు ఊరట!

... 3వ పేజీ తరువాయి

జలవనరులశాఖకు జీవీఎంసీ చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం ఈ బకాయి కోట్లలో ఉంది. ఈ నేపథ్యంలో రిజర్వాయరు గేట్ల నిర్వహణపై రెండు శాఖలు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో మొత్తం ఆరింటిలో నాలుగు గేట్లు పూర్తిగా పాడవగా, రెండుగేట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రతి సీజన్‌లో గేట్లకు గ్రీజు రాయడం, పనిచేస్తున్నాయా? లేదా అనేది తనిఖీ చేయాల్సి ఉంది. ఇటీవల నాలుగు గేట్లకు రంగులు వేయడం మినహా ఇతరత్రా మరమ్మతులు చేయలేదు. పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడంతో ఏటా వర్షాకాలంలో రిజర్వాయర్ నీటి సామర్థ్యం 60 అడుగులకు వచ్చేసరికి రెండు గేట్లు ఎత్తి నీటిని కిందకు విడిచిపెడుతున్నారు. మరమ్మతుల కోసం చాలాకాలంగా ప్రతిపాదనలు రూపొందించినా అమలుకాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలవనరుల ప్రాజెక్టులకు ప్రాధాన్యత పెరిగిన నేపథ్యంలో అధికారులకు అప్రమత్తమై మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్లు మరమ్మతులకు రూ.4 కోట్లతో ప్రతిపాదించారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన తరువాత ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని జలవనరులశాఖ సీఈ ఎస్.సుగుణాకరరావు తెలిపారు. రిజర్వాయర్‌కు గేట్లు చాలా ప్రధానమైనవని పేర్కొంటూ అత్యవసరంగా నిధులు విడుదలచేయాలని కోరామన్నారు.

'పర్యావరణాన్ని కాపాడుదాం'

భీమునిపట్నం, జూలై 8 : పట్టణంలోని సౌమ్యగిరి కొండపై మొక్కల పెంపకంలో భాగంగా మిషన్ గ్రీన్ భీమిలి వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో మట్టి విత్తనాలు వెదజల్లనున్నట్టు ట్రస్టు ప్రతినిధులు డాక్టర్ ముమ్మిడిశెట్టి ఆదిత్య, వెంకటేష్ తెలిపారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సౌమ్యగిరిపై లక్ష సీడ్ బాల్స్ వేస్తామన్నారు. ఆ 16 వారాలు ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం జరుగుతుందని, ఆసక్తి గల వారు భాగస్వాములు కావాలని కోరారు.వివరాలకు 99632 68122, 90142 54571 నంబర్లను సంప్రతించాలని సూచించారు.

వైఎస్సార్ జయంతికి ఏర్పాట్లు చేయండి : సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డి

ఎండాడ, జూలై 7 : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సోమవారం అన్నిచోట్లా నిర్వహించాలని వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కోరారు. ఆదివారం ఆయన ఎండాడలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని, భవిష్యత్తు మనదేనని చెప్పారు. ఈ సమావేశంలో అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కంబాల జోగులు, పెట్ల ఉమా గణేష్ అన్నంరెడ్డి అదీప్‌రాజు, చింతలపూడి వెంకటరామయ్య, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ యాదవ సేవా సంఘం నూతన కార్యవర్గం

వెంకోజీపాలెం, జూలై 7 : పాతవెంకోజీపాలెంలో రాధాకృష్ణ యాదవ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఒమ్మి ముత్యాలరాజు, ఉపాధ్యక్షుడిగా పల్లా పెంటారావు, ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి కోటి, కార్యదర్శిగా ఒమ్మి అప్పలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఒమ్మిరాజు, సహాయ కార్యదర్శిగా జోగ రాంబాబు, కోశాధికారిగా ఒమ్మి శ్రీను, సహాయ కోశాధికారిగా ఒమ్మి జగ్గారావు, యూత్ అధ్యక్షుడిగా పల్లా ప్రసన్న, ఆలయ కమిటీ సభ్యుడిగా పల్లా వంశీ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగనుంది.

సిరుల దేవరకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, జూలై 7 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మ నిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడా మండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున సిరి సంపెంగలతో పూజలు జరిపారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, జూలై 7 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి విజయనగరం ప్రాంతానికి చెందిన పివి శోభనాచలపతిరావు,విజయభారతి దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని ఆదివారం సాయంత్రం ఆలయ పీఆర్‌ఓ డి. అప్పలనాయుడుకు నగదు రూపంలో అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబీకులకు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **డెస్పికెబుల్ ఎం.ఇ.4 :** శారద
- **14 :** వెంకటేశ్వర
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 37, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 82, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 30, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 32, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 84, అల్లం (పాతది) 145, బరబటి 54, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 28, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 6 లో..



భీమిలిలో జగన్నాథస్వామి రథయాత్ర



కొమ్మాదిలో రథయాత్ర నిర్వహిస్తున్న బెటాలియన్ సిబ్బంది

జై జగన్నాథ్

తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర



భీమిలిలో స్వామివారికి పూజలు

భీమునిపట్నం, జూలై 7 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని పలుచోట్ల జగన్నాథస్వామి రథయాత్ర ఆదివారం ఘనంగా జరిగింది. భీమిలిలో తెల్లవారుజామున అర్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు, కృష్ణమాచార్యులు సుభద్ర, జగన్నాథ, బలభద్రులకు తొలిపూజ నిర్వహించారు. అనంతరం స్వామివారి రథానికి పూజ చేసి ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపచేశారు. తరువాత భక్తుల జయజయ ధ్వానాల మధ్య రథ యాత్ర ప్రారంభమైంది. మెయిన్ రోడ్, గంట స్తంభం జంక్షన్, గుప్తావీధి, లక్ష్మీనృసింహస్వామి వీధుల మీదుగా కన్యకాపరమేశ్వరి ఆలయం వీధిలో ఉన్న ఇంద్రజ్యుమ్న మందిరానికి చేరింది. అక్కడ ఉత్సవ మూర్తులను ఆలయంలో ప్రతిష్ఠింపజేశారు. సోమవారం స్వామివారు వేద పురుషావతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్టు అర్చకులు తెలిపారు.

కొమ్మాది : పీఎంపాలెంలో 234 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో జగన్నాథుని రథయాత్ర ఘనంగా నిర్వహించారు. బాబా కళాశాల దరి బెటాలియన్ నుంచి పీఎం పాలెం విజేత సూపర్ మార్కెట్ వరకు రథయాత్ర సాగింది. బెటాలియన్ సిబ్బంది పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సంజయ్‌కుమార్ ద్వివేది,సెకండ్ కమాండెంట్ సురేష్‌కుమార్, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోనూ జగన్నాథస్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సాయంత్రం ఐఐఏఎం కళాశాల నుంచి భక్తులు రథాన్ని లాగుతూ యాత్రను ప్రారంభించారు. హరినామ సంకీర్తన, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో రథయాత్ర ఎంవీపీ డబుల్ రోడ్డు, ఇసుకతోట, వెంకోజీపాలెం, గోకిసన్స్, సమతా కళాశాల, అప్పుఘర్ మీదుగా తిరిగి ఐఐఏఎం కళాశాల వద్దకు చేరుకుంది. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళ హారతి అనంతరం మహా ప్రసాద వితరణతో ఉత్సవాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఐఐఏఎం కళాశాల కరస్పాండెంట్ రవీంద్ర,ద్వారకాజోన్ ఏసీపీ రాంబాబు, కార్పొరేటరు గొలగాని మంగవేణి, టీడీపీ నాయకుడు వెలగపూడి ప్రతాప్, హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్తదాస పాల్గొన్నారు.

సిరిపురం/రామ్‌నగర్ : సిరిపురంలో ఆలిండియా రేడియో కేంద్రం వద్ద ఉన్న ఉత్కల్ సాంస్కృత్ సమాజ్ ఆధ్వర్యంలో జగన్నాథస్వామి రథయాత్ర కన్నుల పండువగా ప్రారంభమైంది. జగన్నాథస్వామి, బలభద్ర, సుభద్రలకు ఉత్కల్ సాంస్కృత్ సమాజ్ అధ్యక్షుడు జేకే నాయక్ సమక్షంలో రథంపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం రథయాత్ర ప్రారంభమైంది. దారి పొడవునా భక్తులు రథాన్ని లాగేందుకు పోటీలు పడ్డారు. రథయాత్ర సిరిపురం మీదుగా వుడా చిల్డ్రన్స్ థియేటర్, హెచ్‌పీసీఎల్ పెట్రోల్ సర్కిల్, చినవాల్తేర్ మీదుగా లాసన్స్ బే కాలనీలోని జగన్నాథస్వామి సోదరి గుండిచా వద్దకు చేరుకుంది. 14 రోజుల పాటు విశేష పూజల అనంతరం తిరిగి స్వామివారు ఆలయానికి చేరుకుంటారని జేకే నాయక్ తెలిపారు. రథయాత్రలో భాగంగా భక్తులకు మంచినీరు, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బిమల్ కుమార్ మహంత , నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఇస్కాన్ ఆధ్వర్యంలోనూ రథయాత్ర ఘనంగా నిర్వహించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై సుభద్రా బలభద్ర సమేత జగన్నాథస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ విశాఖలో నిర్వహిస్తున్న పలు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను భక్తులకు తెలిపారు. ఇస్కాన్ మాతాజీ నితాయ్ సేవిని దయాసాగరుడు జగన్నాథుడు అని, స్వామి దివ్యలీలలను, జగన్నాథస్వామి అవతార విశిష్టతను రథయాత్ర ప్రాధాన్యత తెలియజేశారు. అనంతరం భక్తులు తీసుకొచ్చిన 1008 రకాల ప్రసాదాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.



ఎంవీపీ కాలనీలో భక్తుల కోలాహలం మధ్య రథయాత్ర



సిరిపురం : స్వామివారి రథ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ప్రముఖులు

లొడగలవానిపాలెంలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, జూలై 7 : పేదలకు వైద్యం సేవలందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.ఆదివారం లొడగలవానిపాలెంలో వర్ధమాన సినీ దర్శకుడు బమ్మిడి శ్రీతారక్ తన తండ్రి, మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఉమాదేవి పేర్లమీద బమ్మిడి ఉమానారాయణ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో వందల మంది రోగులకు వృందా ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెట్రోలియం వర్సిటీ మాజీ ఛైర్మన్ డాక్టర్ వీఎస్ ఆర్‌కే ప్రసాద్, భీమిలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, చిక్కాల విజయ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో శంఖు, చక్ర, తిరు నామాల ఏర్పాటు

సింహచలం, జూలై 7 : వరాహలక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరిపై ఈశాన్య పర్వతం వైపు గతంలో మాదిరి శంఖు, చక్ర, తిరు నామాలు ఏర్పాటు చేయడానికి దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి చొరవతో సన్నాహాలు పూర్తి చేశారు.2014లో హుద్‌హుద్ తుఫాన్ ధాటికి సింహగిరిపై ఏర్పాటు చేసిన శంఖు, చక్ర, తిరునామాలు పడిపోయాయి. నాటి నుంచి వాటిని పునరుద్ధరించడంలో అధికారులు విఫలమయ్యారు. తాజాగా జీఆర్‌టీ జ్యూవెలర్స్ సంస్థ ముందుకు వచ్చి రూ. 85 లక్షలు వెచ్చించి వాటి పనులను చేపట్టింది. ఇవి దాదాపు పూర్తి కావొచ్చాయి. సింహగిరి ప్రదక్షిణలోపు వాటిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించనున్నట్టు ఈఓ చెప్పారు.

భీమిలి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వందేళ్ల ఉత్సవాలకు సన్నాహాలు



ఉత్సవ నిర్వహణ కోసం ఎంపిక చేసిన కమిటీ సభ్యులు

భీమునిపట్నం, జూలై 7 : భీమిలి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వందేళ్ల ఉత్సవాల నిర్వహణకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారం వారు పాఠశాల ఆవరణలో సమావేశమై ఉత్సవ నిర్వహణకు కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా గాడు అప్పలనాయుడు, గౌరవాధ్యక్షుడిగా కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి (బాబ్జి), ప్రధాన కార్యదర్శిగా మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారిగా పూసర్ల శ్రీను, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బొండా బాలాజీ ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి అవనాపు అప్పలనాయుడు అధ్యక్షత వహించారు.

పెంట గ్రామంలో భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం, జూలై 7 : మండలంలోని పెంట గ్రామంలో ఈనెల 21న గురు పౌర్ణమి పురస్కరించుకొని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు అని, గురుపౌర్ణమి రోజున జగద్గురువు అయిన కృష్ణ భగవానుడ్ని పూజించాలని ప్రచారం చేశారు. ఈసందర్భంగా త్రైత సిద్ధాంత గ్రంథాలను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో విజయరాంపురం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు కె. త్రినాథరావు, సభ్యులు భవానీ, సంతోష్, లక్ష్మి, అచ్చియ్యమ్మ, భారతి, కళావతి పాల్గొన్నారు.

ముడసర్లోవ పార్కులో క్లీన్ అండ్ గ్రీన్

ఆరిలోవ, జూలై 7 : ముడసర్లోవ పార్కులో బీజేపీ నాయకులు ఆదివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మాట్లాడుతూ పార్కుకు వచ్చిన సందర్శకులు ఇష్టానుసారం చెత్త వేయకుండా డస్ట్ బిన్‌లలో మాత్రమే వేయాలన్నారు. అనంతరం నాయకులు పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ తూర్పు కన్వీనర్ మురళీ మోహన్‌రాజు, అప్పారావు, శ్రీరామ్, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ బాధితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాశర్ల ప్రసాద్

సింహాచలం, జూలై 7 : బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ బాధితులకు జీవీఎంసీ అధికారులు న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం వారు అడివివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ సారథ్యంలో స్థానిక ఎస్ కన్వెన్షన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాధితులు తాము ఎదుర్కొన్న అనేక ఇబ్బందులను తెలిపారు. అనంతరం సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాశర్ల ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఆగస్టు 1న రివైజ్ కానున్న టీడీఆర్ విలువలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే 273 మంది బాధితులకు ఒకే విలువైన టీడీఆర్‌లు ఇప్పించాలన్నారు. రోడ్డు మ్యాప్ డీపీఆర్‌ను పక్కన పెట్టి 30 మంది నిరుపేద ఇళ్ల వద్ద పది అడుగుల మేరకు నిర్మాణలను తొలగించారని, వాటికి అదనపు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 50 శాతం ఇళ్లు కోల్పోయిన వారికి 105 గజాల విస్తీర్ణంతో ప్లాట్లు వేసి ప్రత్యేక లేఅవుట్ సిద్ధం చేసి, అందజేయాలని కోరారు. సమావేశంలో దాసరి సత్యారావు, న్యాయవాది పాలవలస రాంబాబు, సీఐటీయూ నేత చుక్కల సత్యనారాయణ, దేవస్థానం విశ్రాంత పర్యవేక్షణాధికారి సిరిపురపు మహేష్, లండ రాంబాబు, మళ్ల కిరణ్, పంచదార్ల గోవింద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పద్మనాభం, జూలై 7 : పద్మనాభం పంచాయతీ పరిధిలోని ఇసకలపాలెం గ్రామంలో బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు హంస మహేష్ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మాకే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణ నుంచి దారి పొడవునా సుమారు 50 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె. అప్పలరాజు, మాజీ ఉప సర్పంచ్ కె. శివ, అప్పలరమణ, పెద్ద రమణ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి తీరంలో సందర్శకుల సందడి



సాగరకన్య బొమ్మ వద్ద సందర్శకులు

భీమునిపట్నం, జూలై 7 : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం సందడిగా కనిపించింది. వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు సముద్రస్నానాలు చేయగా, మరికొందరు కడలి కెరటాల ఒడ్డున వున్న సాగరకన్య సోయగం, ఐ లవ్ భీమిలి వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

జూపార్కు కిటకిట

ఆరిలోవ : నగరంలోని జూపార్కు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. సుమారు నాలుగు వేల మంది పర్యాటకులు జూకు రాగా వారి నుంచి రూ. 3 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

ట్రాఫిక్ ఎస్‌ఐగా పాపారావు



ఆనందపురం, జూలై 7 : ఆనందపురం ట్రాఫిక్ ఎస్‌ఐగా పి. పాపారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.అంతకముందు స్పెషల్ బ్రాంచిలో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తానని, దీనికి ప్రజలు కూడా సహకరించాలన్నారు. వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.



అపార్ట్‌మెంట్‌వాసులతో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

అందరి సహకారంతోనే విజయం

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎండాడ, జూలై 7 : అందరి సహకారం వల్లే ఎన్నికల్లో తాను విజయం సాధించగలిగానని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డులోని ఎండాడ స్కైలైన్ అపార్ట్‌మెంట్‌వాసులు అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఫంక్షన్ హాల్‌లో కలిశెట్టితో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉన్న రోజుల్లో అంతా కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి ఉండేవాళ్లమని,వారి చూపిన ప్రేమాభిమానాలు మర్చిపోలేనివని, మళ్లీ అవకాశం ఉంటే ఇక్కడే నివాసం ఉండాలని ఉందన్నారు.అపార్ట్‌మెంట్‌వాసులకు ఏ కష్టమైనా, ఆనందమైనా తన కుటుంబ సభ్యులతో పంచుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో అపార్ట్‌మెంట్ వాసులంతా విజయనగరం వచ్చి తమకు తెలిసిన వారితో ఓట్లు వేయించారన్నారు. అనంతరం అపార్ట్‌మెంట్‌వాసులు ఎంపీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' విశాఖ యూనిట్ బ్రాంచి మేనేజర్ రామకృష్ణ, నిర్వాహకులు ప్రభాకర్, నాగేశ్వరరావు, శేఖర్, 8వ వార్డు జనసేన అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, టీడీపీ నాయకులు నున్నా రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కరకచెట్టు పోలమాంబను దర్శించుకున్న అనిత



అమ్మవారికి పూజ చేస్తున్న హోం మంత్రి అనిత

పెదవాల్తేరు, జూలై 7 : పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారిని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగ తం పలికారు. అనంతరం అమ్మవారి గర్భాలయంలో అనిత పేరుతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారి కె. శిరీష, ఆలయ ఈఓ కె. గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పునరుద్ధరణ పనులు ప్రారంభం

పెదవాల్తేరు, జూలై 7 : చినవాల్తేరు ప్రభుత్వ ఛాతి ఆస్పత్రి ఆవరణలో అన్న క్యాంటీన్ పునరుద్ధరణ పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పనులకు జీవీఎంసీ రూ.13.36 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫర్నీచర్, విద్యుత్ లైట్లు, గుల్షన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. జోన్ వన్ మీడియో కో-ఆర్డినేటర్ బైరెడ్డి పోతన్న రెడ్డి పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.

వచ్చే నెల 18 నుంచి కనకమ్మ అమ్మవారి జాతర



సమావేశమైన మూడు సంఘాల ప్రతినిధులు

వెంకోజీపాలెం, జూలై 7 : పాత వెంకోజీపాలెం గ్రామస్థుల ఆరాధ్య దేవత కనకమ్మ అమ్మవారి జాతర వచ్చే 18 నుంచి నిర్వహించేందుకు సీతారామ సేవా సంఘం, రాధాకృష్ణ యాదవ సేవా సంఘం, శెట్టిబలిజ సేవా సంఘం ప్రజలు నిర్ణయించారు. ఆదివారం ఆయా సంఘాల పెద్దలు రామాలయంలో సమావేశమయ్యారు. 18న ఉత్సవం చాటింపు, 19న తొలేళ్లు, 20న అమ్మవారి జాతర చేయడానికి తీర్మానించారు. ఈ సమావేశంలో సీతారామ సేవా సంఘం అధ్యక్షుడు ఆదారి పరదేశి, రాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు, శెట్టిబలిజ సేవా సంఘం అధ్యక్షుడు సంపంగి మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలోని మెస్‌ల తనిఖీ

వెంకోజీపాలెం, జూలై 7 : ఏయూలో విద్యార్థుల మెస్‌లను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. కిషోర్‌బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. నరసింహారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన ఆహారాన్ని వండి విద్యార్థులకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. మెస్‌లో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని వార్డెన్‌లకు సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిషోర్‌బాబు మాట్లాడుతూ మెస్‌ల నిర్వ హణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ఆచార్య బి. మునిస్వామి, కె. రమేష్‌బాబు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

మధురవాడ, జూలై 7 : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో ఆదివారం నగరానికి చెందిన శ్యామలా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. మహా గణపతి ప్రార్థనతో మొదలైన ఈ ప్రదర్శనలో బ్రహ్మాంజలి, జయము.. జయము..గరుడగమన, కొండలలో నెలకొన్న, అదిఒ..అల్లదిఒ శ్రీహరివాసము, వంటి పలు కీర్తనలకు శ్యామల నృత్య దర్శకత్వంలో మోక్షిత, సత్యవర్షిణి, రిషిత, జోషిత, శృతి, శ్రీజ, ప్రణతి నృత్యరీతులు సమకూర్చారు.

గెడ్డలో మునిగి ఇద్దరి మృతి



చందు, జ్ఞానేశ్వర్ మృతదేహాలు

మాడుగుల రూరల్, జూలై 7: మండలంలోని తాటిపర్తి పంచాయతీ బిళ్లలపాలెం గ్రామ శివారులోని తాచేరు గెడ్డలో మునిగి ఆదివారం ఇద్దరు యువకులు మృతి చెందారు. దీనికి సంబం ధించి వివరాలు ఇలా వున్నాయి. తాటిపర్తికి చెందిన కురము చందు(25)కి విశాఖపట్నం ఆరిలోవకు చెందిన మేఘనతో గత నెలలో వివాహమైంది. అక్కడి జీవీఎంసీ పరిధిలో మలేరియా విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా చందు పనిచేస్తున్నాడు. ఆరిలోవలో నివాసముంటున్నారు. చందు స్వగ్రామమైన మాడుగుల మండలం తాటిపర్తికి భార్య మేఘన, ఆమె అన్న జ్ఞానేశ్వర్(22) వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తాటిపర్తి గ్రామానికి పక్కనే ఉన్న బిళ్లలపాలెం గ్రామం సమీపాన గల తాచేరు గెడ్డ వద్దకు వెళ్లారు. చందు, జ్ఞానేశ్వర్‌లు నీటిలో సరదాగా స్నానం చేసేందుకు దిగారు. అయితే అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో ఇద్దరికీ ఈత రాకపోవడంతో మునిగిపోయారు. ఈ సంఘటన చూసిన మేఘన విలపిస్తూ బిళ్లలపాలెం గ్రామస్థులకు చెప్పడంతో వారందరూ సంఘటన స్థలానికి వెళ్లి వారిద్దరిని బయటకు తీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న వారిని మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే వారు మృతి చెందినట్టు నిర్ధారిం చారు. వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.